పునర్ముద్రిత లఘు గ్రంథాలు

ప్రపంచ తెలుగు మహాసభలు

27 - 29, డిసెంబరు, 2012

జానపదసాహిత్యము - వీరగాథలు

రచన

డా॥ తంగిరాల సుబ్బారావు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

జానపదసాహిత్యము - వీరగాథలు

డా॥ తంగిరాల సుబ్బారావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం
హైదరాబాద్

జానపదసాహిత్యము - వీరగాథలు

రచయిత : డాక్టర్ తంగిరాల సుబ్బారావు

ISBN : 81-86073-315-3

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య: 452

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ప్రథమ ముద్రణ : **ఏప్రిల్, 1975**

రెండవ ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

ముద్రణ : **చరిత ఇంప్రెషన్స్,** అజామాబాద్, హైదరాబాదు

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.

(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన డా॥ తంగిరాల సుబ్బారావు గారి "జానపదసాహిత్యము - వీరగాథలు" అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

పరిచయము

ఇరువై శతాబ్దాల తెలుగు చరిత్ర సంస్కృతి పునాదులపైన నిర్మింపబడ్డ తెలుగు జాతి సమైక్యాన్ని సర్వతోముఖాభివృద్ధిని పటిష్ఠం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాక్షసనామ సంవత్సర ఉగాది (1975 ఏప్రిల్ 12వ తేదీ) నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నవి. ఈ మహాసభల ఏర్పాట్లకుగాను ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు అధ్యక్షులు గాను. విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణ రావుగారు నిర్వాహకాధ్యక్షులుగాను ఒక సంఘం ఏర్పడింది. ఈ సందర్భంగా 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించడం జరుగుతున్నది.

ప్రపంచ మహాసభలకు నాందిగా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలోను, ఢిల్లీలోను సంగీత, నాటక, నృత్య, జానపద కళోత్సవాలను నిర్వహించే బాధ్యతను, ఆయా కళారంగాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే బాధ్యతను స్వీకరించవలసిందని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఆకాడమీని ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమం క్రింద అకాడమీ విజయవాడలో నాటకోత్సవాన్ని, అనంతపురంలో వీధినాటకం సదస్సును, నిజామాబాద్‌లో నృత్యోత్సవాన్ని, తిరుపతిలో సంగీతోత్సవాన్ని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ జానపద, నాటక కళోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంలో సంగీత, నృత్య, నాటక, చలనచిత్రాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే అవకాశం కల్పించి, అకాడమీ గ్రంథ ప్రచురణ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం దోహదం చేసింది. అందుకు వారికి మేమెంతో కృతజ్ఞులం. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రచురించిన అనేక గ్రంథాలలో ఈ "జానపద సాహిత్యం-వీరగాథలు" ఒకటి. ఈ గ్రంథాన్ని రచించిన డా॥ తంగిరాల సుబ్బారావుగారికి మా ధన్యవాదాలు.

జె.బాపురెడ్డి
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్ద లందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టముకాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగం నుంచి ఇటీవల బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్క ృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదిక మీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషిని గూర్చి చర్చించి, నిర్ణయించు కోవడానికి, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖం చేసి మన సాంస్క ృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాల నుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల నుండి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి.

తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాల నుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రాహాలయాన్ని 'మ్యూజియంను' స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతి నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజల భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు

అంకితము

చిరంజీవి

"బుల్లి తమ్ముడు"

మేజర్ టి.కె.మూర్తికి......

పరశురాము వంశంలో
ప్రభవించిన పడవాలా!
వీరవరుల గాథలక
ల్హారమాల కూర్చినాను
పరిమళాల పేర్చినాను
కై సేతును నిను 'బుల్లీ' !
నా బ్రతుకున వెలివిరిసిన
నెరపున్నమి జాబిల్లీ!
చీకట్లో చిక్కిన ఈ
చిన్నన్నకు దారిచూపి
విద్దెల వెలుగుల బంగరు
గద్దెల నెక్కించినావు,
మాదు బుల్లి తమ్మయ్య
నా కన్నను చిన్నవాడ
నా కన్నుల వెలుగురేడ
పంచవర్ష పరిశోధన
ఫలితాంశమ్మిదిగో నీకు!

Blank Page

జానపద సాహిత్యము - వీరగాథలు

జానపద విజ్ఞానము (Folklore) :

నేడు ప్రపంచమున అనేక విశ్వవిద్యాలయములందు 'జానపద విజ్ఞానము' (Folklore) అను విషయమును గూర్చిన పరిశోధనలు విరివిగా కొనసాగుచున్నవి. ఇదియొక ప్రత్యేక శాస్త్రముగా అభివృద్ధిచెందుచు, పండితుల మన్ననలను పొందుచున్నది. అంతేకాదు, ఇది అత్యంతావశ్యకమైన ఒక అధ్యయన విషయముగా కూడ గౌరవమును సముపార్జించుకొనుచున్నది.

ఒక దేశము యొక్క నాగరికతలో జానపద విజ్ఞానము కీలకస్థానమును ఆక్రమించుకొని యుండును. అది కోటానుకోట్ల ప్రజలనమ్మకములను, అభిప్రాయములను, దృక్పథములను, నైతిక విలువలను ప్రతిబింబించుచుండును. ఒక దేశమును, దాని ప్రజలను, వారి సంస్కృతిని సంపూర్ణముగా అర్థము చేసికొనుటకు జానపద విజ్ఞానాధ్యయనమే మనకు శరణ్యము.

'Folklore' అనునది ఒకే శబ్దము కాదు; అది 'folk' మరియు Lore అను రెండు శబ్దముల కలయికచే నేర్పడిన సమాసము.[1] ఈ సమాసమును మొట్టమొదట W.J. Thoms అను పరిశోధకుడు క్రీ॥శ॥ 1846లో సూచించినాడు. అతని దృష్టిలో అనగా 'Folk' నిరక్షర కుక్షులైన రైతులు' (unlettered peasantry) 'Lore' అనగా 'పాండిత్యము' లేక విజ్ఞానము' (learning or knowledge), కావున 'Folklore' అనగా అక్షరజ్ఞానము లేని పల్లె ప్రజల సాంప్రదాయక విజ్ఞానము–అదియే జానపద విజ్ఞానము.[2] ఈ జానపద విజ్ఞానము పల్లెపట్టులందేకాదు, పట్టణములలో సహితము ఒక గుంపుగా కూడి పనిచేయు ప్రజల మధ్యకూడ పరిశీలింపవచ్చునని అధునిక

జానపద విజ్ఞానవేత్తల అభిప్రాయము. మనము పరిశీలింపవలసినది జానపదునికాదు, జానపద మనస్తత్వమును. అది విద్యా వంతులలో కూడ నుండవచ్చునని అధునిక వేత్తల నమ్మకము.

జానపద జీవితము (folk–life) నకు సంబంధించిన సమస్త విషయములును జానపద విజ్ఞాన పరిధిలోనికివచ్చి చేరును, Folk-lore means folk learning, comprehends all knowledge that is transmitted by word of mouth and all craft and techniques that are learned by imitation or example, as well as the products of these crafts.[3] దీనినే వేరొక రీతిగా చెప్పవలెనన్నచో: 'సంస్కృతికి సంబంధించిన ఏయే విషయములు భిన్నవిభిన్న రూపములలో, మౌఖిక ప్రసరణమున కాని లేదా ఆచారపూర్వకమైన ఉదాహరణముగాకాని, ఏ గుంపునకు చెందిన వ్యక్తుల మధ్యనైనను సంప్రదాయకముగా ప్రచారమగుచుండునో, ఆ విషయములన్నియు జానపద విజ్ఞానము'[4] అని నిర్వచింపవచ్చును. దీనిని బట్టి ఈ జానపద విజ్ఞానముకు అయిదు ముఖ్య లక్షణములుండునని తేలుచున్నది. (1) సాంప్రదాయిక ప్రచారమును పొందుట:, (2) భిన్నభిన్న పాఠాంతరములు కలిగియుండుట (3) శాబ్దిక కళలనుచో (verbal arts) మౌఖిక ప్రసారమున వ్యాపించుట (4) శాబ్దికేతర కళలనుచో (non verbal arts) ఆచార పూర్వకమగు ఉదాహరణముగా వ్యాపించుట (5) సమాజములో ఏ వర్గమునకు చెందిన వ్యక్తుల మధ్యనైనను కనబడుట.

జానపద సాహిత్యం (Folk Literature) :

'Folk-lore' శబ్దము ఇటీవలి వరకు ఒక్క జానపదుల ఆచార వ్యవహారములకు మాత్రమే పరిమితమై యుండెడిది. కాని నేడు దాని అర్థము అతి విస్తృతమై జానపదులకు సంబంధించిన ప్రతివిషయమును సమీకరించుకొని జానపద సాహిత్యమును కూడ కలుపుకొని ఒక మహా సాగరమైనది.[5] జానపదుల కళలు, చేతిపనులు, పనిముట్లు, దుస్తులు, ఆచార వ్యవహారములు, మూఢవిశ్వాసములు, మంత్ర తంత్రములు, చిలుక జోస్యము నాటువైద్యము, వంటవార్పులు, సంగీతము, పండుగలు-పబ్బములు, వేషభాషలు, హావభావాలు, యాసమాటలు- వీని

అన్నిటితోపాటు 'జానపద సాహిత్యము' (folk-literature) అను పిలువబడుచున్న నిరక్షరాస్యులైన పల్లెప్రజల శాబ్దిక వ్యక్తీకరణము కూడ జానపద విజ్ఞానమునకే చేరును. ఈ జానపద సాహిత్యమును 'శాబ్దిక కళ' (verabal art) అని పిలుచుట ఎక్కువ సమంజసము కాగలదు. ఇందు జానపద కథలు లేక కట్టుకథలు (folktales) ఐతిహ్యాము (legends), పుక్కిటి పురాణములు (myths) జానపదగేయములు (folk-songs) జానపద గేయకథలు లేదా వీరగాథలు (ballads), పొడుపు కథలు (riddles), సామెతలు (proverbs) అను వివిధ శాఖలు గలవు. జానపద విజ్ఞానములో ఈ సాహిత్య విభాగము అత్యంత ప్రధానమైనదిగా భావింపబడుచు, మొదటి నుండియు జానపద విజ్ఞాన వేత్తల దృష్టిని మిక్కిలిగ ఆకట్టుకొన్నది. ఆ వేత్తలు సాహిత్యమునకు సంబంధించిన వారైనను, సామాజిక శాస్త్రములకు సంబంధించిన వారైనను ఈ విభాగమునే ఎక్కువగా విశ్లేషించుచు వచ్చిరి.

ఇటీవలి కాలమున కొందరు విమర్శకులు జానపదులు తమ నిత్య జీవితములో ఉపయోగించెడి వస్తుపరికరముల (folk accessories) ను కూడ జానపద విజ్ఞానములో చేర్చవలసిన ఒక ముఖ్యాంశముగా పరిగణించుచున్నారు.[6] దీనినే వారు జానపదుల భౌతిక సంస్కృతి లేదా వస్తుసంస్కృతి (material culture) అనుచున్నారు. దీనిని పూర్వ విమర్శకులు విస్మరించి యున్నారు.

చదువు సంధ్యలు లేని వెనుకబడిన సమాజములోను, లిపిలేని సమాజములోను జానపద విజ్ఞానము ఆ సమాజముల సంస్కృతితో అభిన్నమైనదిగా నుండును. కాని అక్షరాస్య పారిశ్రామిక సమాజములలో జానపద విజ్ఞానము ఆ సమాజ సంస్కృతి లో ఒక భాగము మాత్రమే. సామూహికముగ సృష్టింపబడిన వస్తువులు, పుస్తకముల మూలమునగాని లేదా నియమిత విద్యాభ్యాసము వలనగాని పొందిన విజ్ఞాన సమాజ సంస్కృతిలో ఒక భాగమనుట సత్యమే. కాని అవి జానపద విజ్ఞానము మాత్రము కానేరవు.[7] మానవ శాస్త్రజ్ఞులు (anthropologists) ను, వాఙ్మయ పరిశోధకులు (humanists)ను జానపద విజ్ఞానమును వేరు వేరుగా నిర్వచించి యుండిరి. (మానవ శాస్త్రజ్ఞుల దృష్టిలో జానపద విజ్ఞానము జానపద సంస్కృతిలో

ఒక భాగము మాత్రమే. గ్రంథస్థము కాకుండ మౌఖిక సంప్రదాయమున వ్యాపించు జానపద సాహిత్యము మాత్రమే జానపద విజ్ఞానము. జానపదుల నమ్మకములు, ఆచారవ్యవహారములు వేడుకలు, వినోదములు మొదలగునవి జానపద సంస్కృతికి చేరునుకాని, జానపద విజ్ఞానమునకు చేరవు. వాఙ్మయ పరిశోధకుల మతమున జానపద విజ్ఞానమనునది జానపద సంస్కృతితో అభిన్నమైనది). అయినను వ్రాతమూలకమున సంపాందించిన విజ్ఞానము మాత్రము జానపద విజ్ఞానము కానేరదని ఈ రెండు మతములవారును అంగీకరించి యుండిరి.

పైన తెల్పిన విషయముల నన్నింటిని పరిశీలింపగా జానపద విజ్ఞానములో ఐదు ప్రధాన భాగములున్నవని తేలుచున్నది:

1. జానపద సాహిత్యమూ లేక 'శాబ్దిక కళలు' (Folk – literature or verbal arts).
2. జానపద భాష (Folk language).
3. జానపద కళలు లేక 'శాబ్దికేతర కళలు' (Folk arts – or 'non verbal arts).
4. జానపద శాస్త్రములు (Folk sciences).
5. వస్తు సంస్కృతి లేదా జానపద పరికరములు (Material culture or folk accessories).

కథలు (tales), గేయములు (songs), గేయ కథలు (ballads) అనునవి జానపద సాహిత్యమునకు చేరును అవి శాబ్దిక కళలు.

వ్యకుల పేర్లు, గ్రామముల పేర్లు, మాండలిక భాషలు, జానపద రూపనిష్పత్తి (Folk etymology), నుడికారము, సామెతలు, పొడుపు కథలు, తిట్లు, ఒట్లు మొదలగునవి జానపద భాషకు సంబంధించినవి.

జానపదుల సంగీతము, నృత్యము, నాటకము చిత్రకళ, శిల్పకళ, వాస్తుకళ, వరికుప్పలు, గడ్డిమేటులు వేయుట, చేతిపనులు, పచ్చబొట్లు పొడుచుట, సింగారము మొదలగునవి శాబ్దికేతర కళలు,

జానపదుల మూఢ విశ్వాసములు, ఆచార వ్యవహారములు, నాటువైద్యము, వంటకములు మొదలగునవి శాస్త్ర విభాగమునకు చెందును.

జానపదులు నిత్యజీవితమున ఉపయోగించెడి పరికరములు, చెంబులు, గిన్నెలు, కంచములు, నగలు, దుస్తులు, సింగారము చేసికొనుటకు ఉపయోగించెడి వస్తువులు పదార్థములు మొదలగునవి వారి వస్తు సంస్కృతి అగును.

జానపద సాహిత్యమును లేదా శాబ్దికకళలను మొదట రెండుగా విభజింప వచ్చును: గద్యాభ్యాసము (prose narrative), కవిత్వము (poetry). ఈ కవిత్వమును శుద్ధగీతములు (pure songs), కథన గీతములు (narrative songs) అని మరల రెండుగా విడదీయవచ్చును. ఇందలి శుద్ధగీతములనే మనము పల్లెపాటలు లేదా జానపద గేయములు (folk songs) అని పిలుచు చున్నాము. కథన గీతములను 'వీరగాథలు' (Ballads) అనవచ్చును. పొడుపు కథలు, సామెతలు అనునవి నిజమునకు జానపద భాషకు సంబంధించినవేయైనను, వానిలో హృదయావర్జకమగు రమ్యత ప్రధానముగానున్నది. కావున వానిని కూడ సాహిత్య భాగమున చేర్చుకొని అభ్యసించుట పరిపాటియైనది. ఇట్లు చేసినచో జానపద సాహిత్యమున అయిదు ముఖ్య వర్గములు బయలుపడును. గద్యాఖ్యానము, జానపద గేయములు, వీరగాథలు, పొడుపు కథలు, సామెతలు. ఈ వర్గములందు కూడ మరల అంతర్భాగములను చూపవచ్చును. ఉదాహరణమునకు గద్యాఖ్యానములో మూడు అంతశ్శాఖలున్నవి, పుక్కిటి పురాణములు (myths), ఐతిహ్యములు (legends), జానపద కళలు (folk tales). ఈ జానపద కథలనే 'జనప్రియ కథలు' (popular tales) అనియు 'కిన్నెర కథలు' (fairy tales), 'కట్టుకథలు' (marchen) అనియు పిలుచుట కలదు. జానపద గేయములలో వలపు పాటలు (love songs), కన్నీటి పాటలు (planctus), పిల్లల పాటలు, వేడుక పాటలు, స్త్రీల పాటలు, శ్రామికుల పాటలు, హాస్యపు పాటలు, తత్త్వములు మొదలగు అంతర్భాగములను గుర్తింపవచ్చును. వీరగాథలను 'లఘువీర గాథలు' (ballad lings), 'వీరగాథలు' (ballads), వీరగాథా చక్రములు' (ballad–cycles) అని మూడుగా విడదీసి చూప వచ్చును. ఈ వీరగాథలలోను, జానపద కథాదులలోను ఉండెడి అఖ్యానాంశములను నేడు (Tale–type Index, Motif–Index) అను అంతర్జాతీయ ప్రసిద్ధిని పొందిన గ్రంథముల నాధారముగా చేసికొని

విశ్లేషించి చూపుచున్నారు. (ఇట్టి విశ్లేణాత్మక విమర్శ తెలుగులో కూడ ప్రారంభము కావలసిన అవసరమెంతేని కలదు.)

పొడువు కథలలో పోలికలు చెప్పబడును కావున ఆ పోలికలను ఆధారముగా చేసికొని వానిని అయిదు రకములుగా వర్గీకరించవచ్చును: (1) మనుష్యుడో లేక జంతువో స్పష్టముగా తెలియని ప్రాణితో పోలిక చెప్పబడిన పొడుపు కథలు; (2) జంతువులతో పోలిక చెప్పబడిన పొడువు కథలు; (3) మనుష్యునితో పోలిక చెప్పబడిన పొడుపు కథలు; (4) చెట్టుతో పోలిక చెప్పబడిన పొడుపు కథలు; (5) వస్తువుతో పోలిక చెప్పబడిన పొడువు కథలు

సామెతల వర్గీకరణమున మూడు రీతులు అనుసరింపబడుచున్నవి : (1) సామెతలోని మొట్టమొదటి మాటను ఆధారముగా చేసి కొని అకారాదిగా సమకూర్చుట, (2) సామెతలోని అతిముఖ్యమైన పదమును తీసికొని అకారాదిగా కూర్చుట, (3) సామెతలోని విషయమును ఆధారముగా చేసికొని వర్గీకరించుట. ఈమూడు రకముల వర్గీకరణములలోను మూడవది ప్రశస్తమైనది. ఏలన, దానిలో భావసాదృశ్యముగల సామెతలన్నియు ఒక చోట చేరుట కవకాశమున్నది. ఈ పద్ధతిలో మొదట విశాల విభాగమును సూచించి, పిమ్మట దానిలో ఉప విభాగములను, అందు వివిధ సామెతల స్థానములను చక్కగా నిరూపించవచ్చును.

ఇట్లు జానపద విజ్ఞానమున జానపద సాహిత్యము ఒక ప్రధాన విభాగమనియు, అందుగల ఐదు శాఖలలో వీరగాథలు ఒకటి అనియు నిరూపించ వచ్చును.

ఇప్పుడు తెలుగులోని వీరగాథలను గూర్చి దిఙ్మాత్రముగా తెలిసికొందము.

పట్టిక -1 :


జానపద విజ్ఞానము (Folk lore)
జా. సాహిత్యము
(F. literature)
జా. భాష
(F. language)
జా. కళలు
(F. arts)
జా. శాస్త్రములు
(F. Sciences)
వస్తుసంస్కృతి
(Material culture)
గద్యాభ్యాసము
(Prose narrative)
జా. గేయములు
(F. Songs)
వీరగాథలు
(Ballads)
పొడుపు కథలు
(Riddles)
సామెతలు
(Proverbs)
పుక్కిటి పురాణములు
(myths)
ఐతిహ్యములు
(legends)
జా. కథలు
(F. tales)
లఘు వీరగాథలు
(Balladlings)
వీరగాథలు
(Ballads)
వీరగాథా చక్రములు
(Ballad - cycles)

వీరగాథలు (Ballads)

ప్రపంచమున వీరులులేని దేశములేదు, వీరగాథలు (Ballads) లేని సాహిత్యమును లేదు. డెన్మార్క్ దేశమందును, 'ఫెరో'ద్వీపములందును కవిత్వమంతయు వీరగాథలతోనే నిండిపోయినది. పోర్చుగీసు సాహిత్యమున వీరగాథలు తప్ప వేరొక ప్రక్రియ కానరాదు. 'సిసిలీ' ద్వీపమున ఏడువేల వీరగాథలున్నవని పరిశోధకుల నిర్ణయము. స్పెయిన్ స్కాట్లండ్ దేశముల వీరగాథా సంపద ప్రత్యేకముగా నెన్నదగినది. మన భారతదేశమున శూరకుల నిలయమగు రాజస్థానము వీరగాథల పురిటిగడ్డ! హిందీ సాహిత్య చరిత్ర వీరగాథా యుగముతోనే శ్రీకారము చుట్టుకొన్నది. మహారాష్ట్రము, పంజాబు, ఆంధ్రప్రదేశములు వీరగాథల కాటపట్టులు!

ఆంధ్రసాహిత్యమున మనము గర్వింపదగినన్ని వీరగాథలు ఉన్నవి. ఇవి మన సాహిత్యమునగల 'మార్గ–దేశి' విభాగములలో దేశికి చెందినవి. దేశి సాహిత్యమందలి కవిత్వము నిబద్ధమనియు, అనిబద్ధమనియు మరల రెండు విధములు. ఇందు వీరగాథలు 'అనిబద్ధదేశి'కి చెందును దీనినే 'శుద్ధదేశి' అనియు పిలువవచ్చును. (ద్విపద కావ్యములు, శతకములు, యక్షగానములు, హరికథలు, వీధి నాటకములు మొదలగునవి 'నిబద్ధదేశికి చెందును). సూక్ష్మ పరిశీలనముచే అనిబద్ధ దేశిలో 'పామరదేశి' (జానపదదేశి), 'జాతిదేశి' అని మరి రెండు శాఖలను గుర్తింపవచ్చును. ఇందు వీరగాథలు పామరదేశికి చేరును. పల్లె పాటలు లేక జానపద గేయములు (folk-songs) వీని సోదరశాఖ స్త్రీల పాటలు, రామదాసు భజన కీర్తనలు, బ్రహ్మంగారి తత్త్వములు మొదలగునవి జాతిదేశికి చేరును). వివరములకై రెండవ పట్టీని చూడుడు.

ఈ వీరగాథలు మార్గకవిత్వములోని ఇతిహాస ప్రక్రియకు మూలకందముగా భావింపబడుచున్నవి. (మహాభారతము 'జయము' అనెడి వీరగాథ నుండి

పట్టిక -2 :



తెలుగు దేశికవిత్వము
అనిబద్ధదేశి
(శుద్ధదేశి)
పామరదేశి
జానపదదేశి
జాతిదేశి
పల్లె పాటలు
(జానపద గేయములు)
వీరగాథలు
(జానపద గేయకథలు)
స్త్రీల పాటలు
రామదాసు భజన కీర్తనలు
బ్రహ్మంగారి తత్త్వములు మొ॥
ముక్తకములు
కథలు



తెలుగు దేశికవిత్వము
నిబద్ధదేశి
సాహిత్య ప్రధానములు
సంగీతోద్దేశకములు
(ఉదా. త్యాగరాజు
కీర్తనలు)
అభినయోద్దేశకములు
(ఉదా. క్షేత్రయ్య పదములు,
జావళీలు మొ॥)
ప్రదర్శనోద్దేశకములు
(వీధి నాటకములు,
యక్షగానములు,
హరికథలు మొ॥)
గేయము
(ఉదా. అన్నమాచార్యుల కీర్తనలు, పెద
తిరుమలాచార్యుల వచనములు, సింహగిరి
నరహరి వచనములు, ఆధ్యాత్మ రామాయణము
మొ॥)
పాఠ్యము
(ఉదా. ద్విపద కావ్యములు. శతకములు, అష్టకములు,
ఉదాహరణములు మొ॥)

పరిణమించినదని విమర్శకుల అభిప్రాయము). జానపద విజ్ఞానము (folklore) నుండి జానపద భాషను, జానపద శాస్త్రములను జానపద కళను వస్తుసంస్కృతి (material culcure) ని తప్పించినచో జానపద సాహిత్యము (folk-literature) మిగులును. ఈ జానపద సాహిత్యమున కథలు (tales), గేయములు (songs) గేయకథలు (ballads) అను మూడు ప్రధాన ప్రక్రియలున్నవి. ఇందలి గేయకథా ప్రక్రియయే ఈ వ్యాసములోని వీరగాథలు!

వీర గాథా నిర్వచనము :

'Ballad' శబ్దము 'battare' అను లాటిను శబ్దమునుండి పుట్టినది. దీనికి మొదట 'నృత్తగీతము' (dance song) అను అర్థమున్నను, నేడు ఆ యర్థము నశించి 'గేయరూపమున నున్నకథ' అను అర్థము వ్యాపించియున్నది. Ballad అనునది బాహ్య స్వరూపమున lyric ను, అంతర స్వరూపమున epic ను పోలియుండునని పాశ్చాత్య విమర్శకులు నిర్ణయించిరి. ఇది గేయరూపముననున్న చిన్న ఇతిహాసము, లేదా కథాత్మకమగు పెద్దగేయము. Ballad శబ్దమునకు సరియైన తెలుగు శబ్దము 'వీరగాథ' 'జానపద గేయరూపమున నుండి, వీరరసప్రధానమగు కథను చెప్పుచు, సంచారగాయక భిక్షువుల (minstrels) చే పాడబడు సరళ కథాగేయమే వీరగాథ' అని తెలుగున నిర్వచింపవచ్చును. బొబ్బిలి కథ, దేసింగురాజు కథ, ముగ్గురు మరాఠీల కథ, సర్వాయిపాపడు కథ మొదలగునవి దీనికి చక్కని లక్ష్యములు.

ఈ వీరగాథలు గాయక భిక్షువులచే రెండు మూడు రాత్రులు పాడదగిన పరిమాణములో నుండును. ఇట్టి వీరగాథలు కొన్ని ఒక ప్రముఖవీరుని చుట్టును అల్లబడి, అతని గూర్చియు, అతని బంధువులను గూర్చియు పెక్కుకథలను వర్ణించుచుండును. ఒక్కొక్కప్పుడు ఒక కులదైవమునకు ప్రాధాన్యమిచ్చి, ఆ దైవమును గొలిచిన రాజుల వృత్తాంతములను అనేక వీరగాథలలో ఒక వరుస క్రమమున పెద్ద ఇతిహాసమువలె చెప్పబడుచుండును. ఇట్టి వీరగాథల సమూహమును 'వీరగాథా చక్రము' (Ballad-cycle) అందురు. తెలుగులో పల్నాటి వీరకథలును, కాటమరాజు కథలును వీరగాథా చక్రములకు సరియైన ఉదాహరణములు. ఈ వీరగాథా

చక్రములను గాథాకారులు (minstrels) నెలల తరబడి పాడుచుందురు. ఇవియే నిజమగు ఇతి హాసము (epics) లనియు రామాయణ మహాభారతాదులు కృత్రిమేతి హాసములనియు కొందరు అమెరికను విమర్శకులమతము.

మరికొన్ని వీరగాథలు మిక్కిలి హ్రస్వములుగ నుండి, జానపదులచే పనిపాటులయందుగాని, గాయకభిక్షువులచే పగటి పూట బిచ్చమెత్తుకొనునప్పుడుగాని పాడబడుచుండును. ఇవి ఒక గంట లోపుననే పూర్తియగును. వీనిలో కొన్ని కథాత్మకములుగను, మరి కొన్ని కేవల కథాసూచకములుగను ఉండును. ఇట్టివానిని 'వీరగాథానికలు' లేక 'లఘువీర గాథలు' (Balldlings) అందురు. తెనుగులో గుఱ్ఱాల గోపిరెడ్డిపాట, మానంది రెడ్డి పాట, బుద్ధా వేంగళరెడ్డిపాట, బండోళ్ళ కురుమన్న పాట మున్నగునవి లఘువీర గాథలకు చక్కని ఉదాహరణములు.

వీరగాథల ప్రాచీనత :

గిరిగహ్వరవాసియగు ప్రాక్తన మానవుని లయాత్మక భాషణమునుండి కాని, నృత్తగీతమునుండి కాని కవిత్వము పుట్టియుండును. దీని ప్రాథమిక రూపము శుద్ధగేయము. దీనితో కథాకథనము కలిసి వీరగాథ ఏర్పడి యుండును. ఈ గేయములు, కథాగేయములు పద్యకవిత్వము కన్న ప్రాచీనములనుటలో సందేహము లేదు. గేయముల ఛందస్సులో పద్యముల ఛందస్సుకన్న నియమములు తక్కువగ నుండుటకూడ గేయముల ప్రాచీనతకు పోషకమగుచున్నది. క్రీ.పూ. 5000-4000 సంవత్సరములకు చెందిన మన వేదములలో వీరగాథా బీజములున్నవి. ఈ వేదములు ప్రాచీనార్యుల జానపద విజ్ఞాన (folklore) మని విమర్శకుల తలంపు. ఇందలి ఉపాఖ్యానములు వీరగాథలే. వేదములలో వీరగాథలు 'గాథా','నారాశంశీ' అను పేర్లతో వ్యవహరింపబడినవి. త్రేతాయుగమున రచింపబడిన రామాయణము, క్రీ.పూ. 3100 ప్రాంతమున రచింపబడిన మహాభారతము - ఈ రెండును ప్రాచీన వీరగాథలనుండి 'ఐతిహాసిక క్రమము' (epic-process) న ఏర్పడి యుండును. నలుని కథ, హరిశ్చంద్రుని కథ ఈ రామాయణ మహాభారతముల కన్న ప్రాచీనములైనవి. ఇవి భారతదేశ మందంతటను వ్యాప్తినొందిన ఐతిహ్యములు (legends).

వీరశబ్ద ప్రాచీనతను బట్టి కూడ వీరగాథలు ప్రాచీనములని తలంపవచ్చు. వివిధ ప్రాకృతములలో వీరగాథ లుండియుండును. అపభ్రంశములోని 'రాసములు' వీరగాథలు కావచ్చును. క్రీ.శ. మొదటి శతాబ్దము నాటి గుణాఢ్యుని 'బృహత్కథ' పిశాచములనబడు జానపదుల ముఖస్థ సాహిత్యము నుండి నిర్మింపబడి యుండును. ఈ పిశాచములు ఆదిమ జాతులని అనుమానింప వీలున్నది. కాళిదాసు కాలమున వత్సరాజగు ఉదయనుని సాహస గాథలు పల్లెలలో ప్రచారమందున్నవి. క్రీ.పూ. రెండవ శతాబ్దము నుండియు రాజస్థానులో వీరగాథలున్నవని తలంపవచ్చును. గ్రీకు, లాటిను, ఆంగ్లొశాక్జను, జర్మను, హీబ్రూ, చైనీస్ మున్నగు ప్రాచీన విదేశ సాహిత్యములందు గూడ వీరగాథలున్నవనుటకు సాక్ష్యములున్నవి. భారతదేశమున తమిళము, కన్నడము, పంజాబీ, అస్సామీ భాషలలో ప్రాచీన వీరగాథలున్నవని తెలియుచున్నది. సంగీత నాట్యశాస్త్ర గ్రంథములలోని దేశి రాగములయు, గేయములయు ప్రసక్తిని బట్టి కూడ వీరగాథల ప్రాచీనత తెలియనగును. తెలుగులో ప్రాఙ్నన్నయ యుగమున గేయములు, వీరగాథలు కలవనుటకు ప్రబలమగు తార్కాణములున్నవి.

వీరగాథల ఉత్పత్తి కర్తృత్వములు :

వీరగాథల ఉత్పత్తి కర్తృత్వములు వివాదగ్రస్తమైనవి. పాశ్చాత్య విమర్శకులలో కొందరు, వీరగాథలు అతి ప్రాచీనకాలమున జానపద సంఘములచే నృత్యమునందు ఆశువుగా సృజింపబడినవి సిద్ధాంతము చేసినారు. మరి కొందరు ఈ సిద్ధాంతమును ఖండించి, వీరగాథలు మధ్యయుగములలో గాథాకారులచేతను, ప్రత్యేక కవుల చేతను రచింప బడినవనియు, వీనికి మూలము ప్రాచీన శిష్టసాహిత్య మనియు వాదించుచున్నారు.

ప్రాక్తన మానవుని నృత్తగీతమున భావాత్మకమగు చిన్నపాట పుట్టునుగాని, కథాకథనముతో గూడిన పెద్ద పాట పుట్టుట స్వభావ విరుద్ధము. కావున వీరగాథ జానపద గేయముకన్న ప్రాచీనమైనది కాజాలదు. ఇతిహాసములకు మూలము

వీరగాథలు కావచ్చును. అయినను, క్రీ.శ. పంౘ్రెండవ శతాబ్దముకన్న ప్రాచీనమైన వీరగాథలు ప్రపంచమున ఏ దేశమందును నేడు లభించుటలేదు.

అన్ని వీరగాథలును ఒకే విధముగా పుట్టవు. తెలుగులో కొన్ని వీరగాథలు శ్రీనాథాది ప్రత్యేక కవులచే రచింపబడినవి. మరికొన్ని వీరగాథలు జంగముల ఆశురచనలుగా పుట్టినవి. వీరగాథ యీ రెండు విధములలో ఏ విధముగా పుట్టినను. సిసలైన వీరగాథా స్వరూపమేర్పడుటకు అది కొంత కాలము ప్రజలలో మౌఖిక సంప్రదాయము (oral tradition) న నలిగి తీరవలెను.

నాగరకత వీరగాథోత్పత్తికి పరమశత్రువు. ఆంధ్ర దేశమున నాగరకములైన మాగాని ప్రాంతములకన్న, అనాగరకములైన మెట్ట ప్రాంతములలో వీరగాథ లధికముగా పుట్టుచున్నవి. దేశ నైసర్గిక స్వరూపము, జాతి మనస్తత్త్వము, కులస్వభావము మున్నగునవి వీరగాథోత్పత్తిలో కీలకస్థానమును వహించును.

విదేశ భాషలు - వీరగాథలు :

ప్రపంచమున డెన్మార్కు, ఫేరోద్వీపములు (Fearoe Islands) స్కాట్లండు, పోర్చుగల్, సిసిలీ ద్వీపము, స్పెయిన్ దేశములలో వీరగాథ లత్యధికముగా నున్నవి. డెన్మార్కు దేశమందును, తత్సంబంధమగు ఫేరో ద్వీపములందును కవిత్వమంతయు వీరగాథలతోనే నిండిపోయినది. ఒక్క డెన్మార్కునకే కాక తక్కిన స్కాండినేవియా దేశముల (నార్వే, స్వీడన్, ఐస్‌లాండ్ దేశముల) కన్నింటికిని వీరగాథలు గర్వకారణమగు సాహిత్యముగా పరిణమించి భాసిల్లుచున్నవి. స్పెయిన్ సాంప్రదాయిక వీరగాథలు (traditional ballads) వీనిని తలదన్నినవిగా నున్నవి. పోర్చుగీసు సాహిత్యమున వీరగాథలు తప్ప వేరొక ప్రక్రియ కానరాదు. ఇటలీ దేశ విభాగమగు సిసిలీ (Sicily) ద్వీపమున ఏడువేల వీరగాథలున్నవని 'పిట్రే' (Pitre) వంటి పరిశోధకులు నిర్ణయించినారు. ప్రపంచమున కొద్దియో గొప్పయో వీరగాథలు లేని దేశము లేదని చెప్పవచ్చును.

భారత భాషలు - వీరగాథలు :

భారత దేశమున రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబు రాష్ట్రములలో

వీరగాథలు కొల్లలుగా నున్నవి. వీరగాథా సంపదలో డెన్మార్కు, స్పెయిన్ దేశములతో పోల్చదగినది రాజస్థాన్. హిందీ సాహిత్య చరిత్రమున వీరగాథల కొక ప్రత్యేక యుగమును సంతరింప జేసినది రాజస్థానీ మాండలికమే. వీరగాథను రాజస్థాన్‌లో 'రాసో'అనియు, 'చారణగీత్'అనియు పిలుతురు. 'పృథ్వీరాజరాసో' ప్రాచీనమును ప్రశస్తమును అగు వీరగాథ మహారాష్ట్రమున శివాజీని గురించి ఎన్నియో వీరగాథలున్నవి. మహారాష్ట్రులు వీరగాథను 'పొవాడే' అందురు. పంజాబీలు వీరగాథను 'వార్' అందురు. 'నాదిర్ షాదీ వార్' పంజాబీలో మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన వీరగాథ. కన్నడమున వీరగాథను 'లావణి' అనుచున్నారు. ఇందు కుమారరాముని కథె, కీత్తూరు చెన్నవ్వరాణి కథె, కరిబెంటన కథె, కెరెగెహార, గోవినహాడు మొదలగునవి ప్రసిద్ధ లావణులు, భారత దేశమున ఇతర భాషలందును వీరగాథలు పుష్కలముగా గలవు.

తెలుగులో వీరగాథలు :

భరతఖండమున వీరగాథాసంపదలో రాజస్థాన్‌తో తులదూగగల రాష్ట్రము మన ఆంధ్రదేశము. పౌరాణికములు, చారిత్రకములు, సాంఘికములు మున్నగు విభాగముల క్రిందికివచ్చు వీరగాథలు తెలుగులో కోకొల్లలుగా నున్నవి. సంఖ్యా బలముననేగాక, ప్రాశస్త్య ప్రాచీనతలో గూడ నివి వన్నె కెక్కినవి. పల్నాటి వీరగాథలు, 'కాటమ రాజు కథలు క్రీ.శ. 12, 13 శతాబ్దముల నాటికే తెనుగు గడ్డపై మారుమ్రోగు చుండినవి. మన బొబ్బిలి కథ ప్రపంచమున వ్రేళ్లపై లెక్కింపదగిన అత్యుత్తమ వీరగాథలలో నొకటి! ప్రాక్ప్రతీచీ విమర్శకులు చెప్పిన వీరగాథాలక్షణము లన్నింటిని పుణికి పుచ్చు కొనిన పరమ ప్రశస్తి వీరగాథ మన బొబ్బిలి యుద్ధ కథ! తెలుగు సాహిత్యమున వీరగాథ లెక్కువగా నుండుటయేకాక, వీరగాథా చక్రములు (ballad cycles) ను ఎక్కువగా నుండుట మరియొక విశేషము! (తక్కిన భారత భాషలలో నిట్టి సుదీర్ఘ చారిత్రక వీరగాథా చక్రములు కానరావు). పౌరాణికములలో పరశురాముని కథాచక్రము, అస్పష్టచారిత్రకములలో అంకమ్మ కథాచక్రము, చారిత్రకములలో పల్నాటి వీరకథాచక్రము, కాటమరాజు కథాచక్రము మిక్కిలి ప్రసిద్ధి కెక్కినవి. బొబ్బిలి కథ, దేసింగురాజు కథ, బాలనాగమ్మ కథ, కాంభోజరాజు కథ,

ముగ్గురు మరాఠీల కథ, లక్షుమమ్మ కథ, కామమ్మ కథ, సన్యాసమ్మ కథ, చిన్నమ్మ కథ, తిరుపతమ్మ కథ, ఎరుకల నాంచారి కథ, పసల బాలుడు కథ, సర్వాయి పాపడు కథ, చిన్నపరెడ్డి కథ, సదాశివరెడ్డి కథ, బంగారు తిమ్మరాజు కథ, కొమార రాముడి కథ, గాంధారి కథ – మున్నగునవి తెలుగు నేలపై తరతరముల నుండి పాతుకొని పోయిన వీరగాథలు! తెలుగు గాలిలో చిరకాలముగా మారు మ్రోగుచున్న వీరగాథలు! తెలుగు రక్తములో జీర్ణించిపోయిన వీరగాథలు!!

ప్రాచీన కవులలో నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, క్రీడాభి రామకర్త, పాలవేకరి కదిరీపతి (శుకసప్తతి). అయ్యలరాజు నారాయణామాత్యుడు (హంసవింశతి) మున్నగు వారు జానపద సాహిత్య ప్రసక్తి నెక్కువగా దెచ్చినారు. ఆంధ్రవాగ్గేయ కారుల రచనలు కొన్ని జానపద కవితాను కరణములు తెలుగు దేశిరాగముల ప్రసక్తియు, గేయముల ప్రసక్తియు కొన్ని సంగీత లక్షణ గ్రంథములలో సహితము గలదు. ఊహను బట్టి పరిశీలించినచో తెలుగు భాష సుస్థిరరూపమును దాల్చినప్పటి నుండియు, అనగా క్రీ.శ. 6, 7 శతాబ్దముల నుండియు వీరగాథ లుండియుండవలెను. ప్రాచీన కవుల ప్రసక్తిని బట్టి పరిశీలించినచో నన్నయకు పూర్వము నుండియు వీరగాథలు కలవని తెలియుచున్నది. ఉపలబ్ధములను బట్టియు, చారిత్రక సంఘటనలను బట్టియు పరిశీలించినచో తెలుగులో 'పల్నాటి వీరచరిత్ర'యను వీరగాథాచక్రము ప్రాచీనమైనదిగా కన్పట్టుచున్నది. ఇందలి యితివృత్తము క్రీ.శ. పంద్రెండవ శతాబ్ది చతుర్థపాదమున (క్రీ.శ. 1178 –1182 మధ్య కాలమున) జరిగిన చారిత్రక సంఘటనము ఉత్తర హిందూ దేశమున క్రీ.శ 12వ శతాబ్దమునాటి 'పృథ్వీరాజరాసో' అను రాజస్థానీ వీరగాథను, క్రీ.శ. 13వ శతాబ్దమునాటి 'తుగ్లక్ షా ఖుస్రోన్‌ఖాన్ వార్' అను పంజాబీ వీరగాథను తప్పించినచో, మిగిలిన వన్నియును పదునేనవ శతాబ్దమునకు తరువాతివే. క్రీ.శ. 12వ శతాబ్దమున 'సిరియాళుని కథ', 13వ శతాబ్ది ఉత్తరార్ధమున పల్నాటి వీరకథలు, పరశురాముని కథలు విరివిగా పాడబడుచుండినట్లు ప్రబల సాక్ష్యము లున్నవి.

వీరగాథా లక్షణములు :

డా॥ బి. రామరాజుగారు జానపద గేయ (Folk - song), పరముగా చెప్పిన పది లక్షణములలోను 'మౌఖిక ప్రచారము, సహజశైలి, పాడుటకు వీలుగా నుండుట, పునరావృత్తి, జనసామాన్య పరిచిత వస్తువును కలిగియుండుట, ఆశురచనలు' – అను ఆరు లక్షణములు వీరగాథలకు గూడ వర్తించుచున్నవి. 'బ్లిస్‌పెర్రీ' (Bliss perry) అను పాశ్చాత్య విమర్శకుడు వీరగాథల నిస్సందేహ లక్షణములను విడమర్చి చెప్పినాడు. మొత్తముపై వీరగాథలకు అతిప్రధానములైన పదిలక్షణము లుండునని నిశ్చయింపవచ్చును: వీరగాథ గేయ స్వరూపమున నుండును– ఇది ప్రథమ లక్షణము. సరళచ్ఛందము, పునరావృత్తి (refrain), గానయోగ్యత– అనునవి ఇందలి ఉప లక్షణములు. వీరగాథ కథాఖ్యానాత్మకముగా నుండును – ఇది ద్వితీయ లక్షణము. నియమిత పరిమాణము, యథార్థ సంఘటనా జన్యత్వము, దేశీయేతి వృత్తము, నాయకాభేదత, వీరరస ప్రాధాన్యము, కథాసారళ్యము, హఠాత్ప్రారంభత్వము, సంభాషణా సహితత్వము, వచన రాహిత్యము, విషాదాంతత, అభివర్ధిత పునరుక్తి (incremental repitition) అను పదునొకండును ద్వితీయ లక్షణములోని ఉప లక్షణములు. గాయక భిక్షువుల ఆశుకవనమున జనించుట వీరగాథ యొక్క తృతీయ లక్షణము. కవి నామము తెలిసినను వీరగాథ అప్రధాన కర్తృకముగా నుండుట తృతీయ లక్షణములోని అవాంతర లక్షణము. మౌఖిక సంప్రదాయమున (oral transmission) దేశమంతయు వ్యాపించుట, మౌఖిక సంప్రదాయమున (oral tradition) తరతరములు జీవించుట వీరగాథల నాల్గవ లక్షణము. బహుజనాదర పాత్రత లేక జనప్రియత్వము (popularity) ఇందలి అవాంతర లక్షణమే. వీరగాథ, నాటకమువంటి శుద్ధ పరాశ్రయ కవిత్వము (objective poetry). ఇది దీని ఐదవ లక్షణము.

వీరగాథలలో భాషయేకాక భావములును సరళముగానుండును. వీరగాథలలో కొన్ని పడికట్టు వర్ణనలు పదేపదే ప్రయోగింపబడును. వీనిని 'వీరగాథల వారాను వర్తనములు' (ballad commonplaces) అందురు. ఇట్టి శైలీ సారళ్యమును,

వారానువర్తనములను కలిగి యుండుట వీరగాథల ఆరవ లక్షణము. ఎంతటి ప్రతిభావ్యుత్పత్తులు గల కవియైనను సాంప్రదాయిక వీరగాథను తనంతతాను సృజింపలేడు. వీరగాథ ప్రజలలో సహజముగా పుట్టును. తరువాత దీనిపై కవిచేయి పడవచ్చును. ఇట్లు అనితర సాధ్యములుగా నుండుట వీరగాథల ఏడవ లక్షణము. ప్రపంచమున వివిధ దేశముల వీరగాథలలో ఒక ఏక సూత్రము కాన్పించును. అందుచే వీరగాథలు ప్రాక్తన మానవ సంఘమును, వసుధైక కుటుంబమును నిరూపింప సమర్థములని చెప్పవచ్చును. ఇట్టి అద్వితీయ గుణము (unique charecter) గలిగియుండుట వీరగాథల ఎనిమిదవ లక్షణము. వీరగాథలు నీతిని వాచ్యముగా బోధింపకున్నను, ధ్వనింపజేయును 'విధిబలీయము, మానవుడు నిమిత్తమాత్రుడు' అనునదియే వీనియందు ధ్వనితమగునీతి. ఇట్టి నీతిని ధ్వనింపచేయుట వీరగాథల తొమ్మిదవ లక్షణము. వీరగాథలు జీవన సంగ్రామమును సామాన్య సైనికునివలె యథాతథముగా మనకు నివేదించుచు, జీవితములో ప్రతి ప్రస్థానము చివరను ఓటమి యున్నదను విషాద విషయమును ప్రతిధ్వనించుచుండును. ఇది వీరగాథల పదియవ లక్షణము. ఈ పది లక్షణములలోను కొన్ని వీరగాథలకు ఎక్కువగా వర్తించును. మరికొన్ని వీరగాథానికలకు ఎక్కువగా వర్తించును. వీరగాథలలో ఇతిహాస లక్షణములును, వీరగాథానికలలో జానపద గేయ లక్షణములును హెచ్చుగా కాననగును.

వీరగాథల ప్రాశస్త్యములు తెల్పు లక్షణములేకాక, వానిలోపములను తెలుపు లక్షణములును కొన్ని గలవు: సామూహిక రసానందమునేకాని, వ్యక్తిగత రసానందమును ఈయలేక పోవుట, పదములు వర్ణనలు పదేపదే పునరుక్తములగుట., సంఘటనలు ఘోరాతిఘోరముగా వర్ణింపబడుట., ఒకే పక్షము వారిని అభిమానించుచు రచన సాగుట., పర్యవసానమున ఏ విధమగు పరమార్థమును సాధింపకుండుట, ఛందో వైవిధ్యము లేకుండుట., మిక్కిలి పరిమితమగు పదజాలమును కలిగి యుండుట – మున్నగునవి వీరగాథల ప్రధాన లోపములు.

వర్తమాన కాలమున తెలుగు దేశీ సాహిత్యమున విజృంభించిన 'బుఱ్ఱకథలు' వీరగాథానుకరణము లేకాని సాంప్రదాయిక వీరగాథలు కానేరవు. ఈ బుఱ్ఱకథలకు పైన చెప్పిన ముఖ్య లక్షణము లేవియు వర్తింపవు. కన్నడ దేశి సాహిత్య మండలి లావణీలను, మరాఠీ సాహిత్య మందలి 'పొవాడే' లను మన బుఱ్ఱకథలతో పోల్చవచ్చును.

వీరగాథల వర్గీకరణము :

ఏ సాహిత్యమందైనను వీరగాథలు ప్రధానముగా రెండు వర్గములుగా నుండు. తరతరముల నుండి మౌఖిక సంప్రదాయమున వచ్చుచున్న వీరగాథలు మొదటి వర్గము. వీనిని సాంప్రదాయిక (traditional ballds) అనియు, 'జనప్రియ వీరగాథలు' (popular ballads) అనియు పిలుతురు. ఈ సాంప్రదాయిక లేదా జనప్రియ వీర గాథలకు అనుకరణములుగా ప్రత్యేక కవులచే రచింపబడిన వీరగాథలు రెండవ వర్గము. వీనిని 'సాహిత్య వీరగాథలు' (literary ballads) అందురు (తెలుగులో ద్విపద కావ్యములిట్టివి). ఇందు మొదటి వర్గము మాత్రమే ప్రధానముగా పరిశీలింప బడుచున్నది. వీర గాథలనగా సాంప్రదాయిక వీరగాథలనియే భావము. ఇట్టి వీరగాథలను ఛందస్సును బట్టి వర్గీకరించుటకన్న ఇతివృత్తములనుబట్టి వర్గీకరించుట సమంజసము. Prof. Louise pound, Frarcis Bugammere మున్నగు పాశ్యాత్య విమర్శకులు వీరగాథల యితివృత్తములనే ప్రధానముగా గైకొని వర్గీకరించిరి.

తెలుగు విమర్శకులలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, హరి ఆదిశేషుగారు, ప్రొ॥ బి.రామరాజుగారు, నేదునూరి గంగాధరంగారు, పింగళి లక్ష్మీకాంతంగారు – వీరగాథల వర్గీకరణ విధానమును కొంతలోకొంత సూచించినారు. ఇందు శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారి వర్గీకరణము ప్రశస్తమైనది. వీరు 1953లో సూచించిన వర్గీకరణముకన్న, 1961లో చేసిన వర్గీకరణము మరింత హేతుబద్ధముగానున్నది. వీరు జానపద గేయవాఙ్మయమునంతటిని 'విడి గేయములు, 'కథాగేయములు, అను రెండు ప్రధాన భాగములుగా విడదీసిరి, (ఇవి పాశ్చాత్యులు చేసిన 'folk-songs: Ballads' అను విభాగములకు సరిగా అన్వయించును). ఇందు కథా

గేయములలో 'జంగం కథలు, బొబ్బిలిపాట వంటివి, పదములు, స్త్రీల కథా గేయములు' అను నాలుగు విభాగములను సూచించిరి.

తెలుగు వీరగాథలను వర్గీకరించుటలో మౌఖిక సంప్రదాయము, కాల ప్రమాణము, భాషామాండలిక విభాగములు, ఇతివృత్తములు, ఛందస్సు, గాథాకారులు, పునరావృత్తి, జానపద వాద్యములు, ప్రధానవీరులు, కులదైవములు, దర్శనములు–మున్నగు వానిని ఆధారముగా చేసికొనవలెనని నా అభిప్రాయము. అయినను ఈ వర్గీకరణములో అతి ముఖ్యమైన జానపద వ్యవహారమును విస్మరింపరాదు. నాయభిప్రాయమున జానపద కవిత్వము (folk poetry) ను పల్లె పాటలు లేక జానపద గేయములు (folk songs) జానపద గేయకథలు లేక వీరగాథలు (ballads) అని రెండు ప్రధాన భాగములుగా విభజింపవచ్చును. ఇందు వీరగాథలలో మరల రెండు రకములున్నవి: సాంప్రదాయిక వీరగాథలు (traditional ballads) లేక 'జనప్రియ వీరగాథలు' (popula ballads) –'వీరగాథానుకరణములు (ballads-of imitation) ఇందు సాంప్రదాయిక వీరగాథలను మూడు ప్రధాన విభాగములుగా విడదీయవచ్చును: వీరగాథాచక్రములు (ballad-cycle), వీరగాథలు (ballads) వీరగాథానికలు లేక లఘువీరగాథలు (ballad lings). వీనిలో మొదటి విభాగమైన వీరగాథాచక్రములలో ఇతివృత్తములను బట్టి 'శక్తికథాచక్రము, పల్నాటి వీరకథాచక్రము, కాటమరాజు కథాచక్రము, వెలకంటివీరుని కథాచక్రము' అను శాఖలను గుర్తింపవచ్చును. 'ఎల్లమ్మ కథాచక్రము, అంకమ్మకథాచక్రము, చౌడమ్మపాటలు, ఇతర శక్తికథలు' శక్తికథాచక్రములోని అంతశ్శాఖలు.

రెండవ ప్రధాన విభాగమైన వీరగాథలు ఛందస్సును బట్టి 'బొబ్బిలి వరుస కథలు, పదములు, జంగంకథలు' అనుమూడు వర్గములుగా విడిపోవును. ఇందు పదములలో 'హరిహరీ పదములు, శారద పదములు అను అంతర్భేదములు కానవచ్చును. బొబ్బిలికథ, దేసింగు రాజుకథ, బాలనాగమ్మకథ, కాంభోజరాజుకథ, ముగ్గురు మరాఠీల కథ, సాసూలు చిన్నమ్మకథ, కామమ్మకథ, లక్ష్మమ్మకథ, సర్వాయి పాపడుకథ, చిన్నపరెడ్డికథ, సదాశివరెడ్డికథ, కొమారరాముడికథ– మొదలగునవి

'బొబ్బిలి వరుస కథ'లకు ఉదాహరణములు. లక్ష్మణ మూర్ఛ, గంగావివాహము, శతకంఠ రామాయణము, కుశలాయకము, ధర్మాంగదచరిత్ర (పాముపాట) - మున్నగునవి హరిహరీ పదములు. శారద రామాయణము, శారద హరిశ్చంద్ర, శారదసారంగ ధర - మున్నగునవి శారద పదములు. సిరియాళ మహారాజు చరిత్ర, భళ్ళాణరాయ చరిత్ర, నిజలింగ చిక్కయ్యకథ, విరాటపర్వము, వామన విజయము, దేవయానిచరిత్ర మొదలగునవి జంగం కథలకు ఉదాహరణములు.

పైన తెల్పిన మూడవ ప్రధాన విభాగమైన వీరగాథానికలకు (లఘువీర గాథలకు) 'గుర్రాల గోపిరెడ్డిపాట, మానందిరెడ్డిపాట, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాట, బుడ్డా వెంగళరెడ్డిపాట, ఓబుల రెడ్డిపాట, కొరుమన్నపాట, విరూపాక్షరెడ్డిపాట, ఈడిగ రామన్నపాట, బండోళ్ళ కురుమలన్నపాట, రాచోటి రామయ్యపాట, వెంకట్రామిరెడ్డిపాట, గడేకల్లు నాగిరెడ్డిపాట, మల్లన్నపాట, ధర్మాపురం నరసింహుని పాట మొదలగునవి ఉదాహరణములు. ఇవన్నియు కొలది నిముషములలో పాడబడు కతాత్మక లేదా కథాసూచక వీరగేయములు, వీరగాథా చక్రములు నెలలకొలది పాడబడు సుదీర్ఘ కథనమును కలిగియుండును. వీరగాథలు రెండు మూడు రాత్రులలో పూర్తియగును. కాబట్టి 'వీరగాథా చక్రములు, వీరగాథలు, లఘువీరగాథలు' అను త్రివిధ వర్గీకరణము కొంతవరకును కాలప్రమాణమును బట్టి చేయబడినదని చెప్పవచ్చును. ఇవన్నియును సాంప్రదాయిక వీరగాథలు.

ఈ సాంప్రదాయిక వీరగాథలను అనుకరించుచు నేడు బయలు దేరిన 'బుఱ్ఱ కథలు, జముకుల కథలు, సుద్దుల కథలు, తందనాన కథలు, బతుకమ్మపాటలు' అనునవి 'వీరగాథానుకరణము'లనబడును. వీనిలో బుఱ్ఱకథలు - బొబ్బిలి వరుస కథలకును, జంగం కథలకును అనుకరణములు. జముకుల కథలు - హరిహరీ పదములకు అనుకరణములు. సుద్దుల కథలు - కాటమరాజు కథలకును, తందనాన కథలు- బొబ్బిలి వరుస కథలకును, బ్రతుకమ్మ పాటలు - ప్రాచీనములైన బ్రతుకమ్మ పాటలకును అనుకరణములని చెప్పవచ్చును. (చూడుడు పట్టీ-3).

ఇప్పుడు 'శక్తికథలు, పల్నాటి వీరకథలు, కాటమరాజు కథలు' అను తెలుగు వీరగాథాచక్రములను గూర్చియు, 'బొబ్బిలి వరుస కథలు, పదములు, జంగం కథలు' అను వీరగాథలను గూర్చియు, వీరగాథానికలు లేక లఘువీరగాథలను గూర్చియు, బుఱ్ఱకథాది వీరగాథానుకరణ ప్రక్రియలను గూర్చియు కొంత వివరముగా తెలిసికొందము.

శక్తికథాచక్రము (The Ballad-cycle of shakti) :

శక్తి ఆరాధనము భారతదేశమున అతిప్రాచీన కాలమునుండియు కలదు. శక్తులు అనంతవిధములు. ఇవి యన్నియును ఆదిశక్తి యొక్క వివిధావతారములే. జానపదులు ఎల్లమ్మ, అంకమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, ముత్యాలమ్మ మున్నగు ఆదిశక్తుల నారాధింతురు. ఈ యారాధనా రూపములే మన పల్లెలలో జరుపబడు గ్రామదేవతల జాతరలు. ఈ జాతరలలో ఆయాశక్తుల కథలను మాల మాదిగలు గానము చేయు చుందురు. ఎల్లమ్మ కథలు, అంకమ్మకథలు, చౌడమ్మ పాటలు, పోలేరమ్మకథ, మాతాపురాణము, ఆదిపురాణము లేక ఆరంజ్యోతి కథ మున్నగునవి తెలుగులో వ్యాప్తియందున్న శక్తి వీరగాథలు. వివిధ శక్తులన్నియు ఆదిశక్తి యొక్క అపరరూపములే కావున ఈ వీరగాథలన్నింటిని ఒకేఒక వీరగాథాచక్రము' అని పేరిడవచ్చును. ఇట 'శక్తి' అనగా 'ఆదిశక్తి' అని యర్థము. ఈ శక్తి కథాచక్రములో ఎల్లమ్మ కథలు, అంకమ్మ కథలు తమతమ ప్రత్యేకతను చూపుచున్నవి. ఇవి కూడ ప్రత్యేక కథాచక్రములుగా ఏర్పడియున్నవి.

నేను పరిశోధించినంతవరకును ఎల్లమ్మ కథాచక్రమున తొమ్మిది గాథలును, అంకమ్మ కథాచక్రమున మూడు గాథలును కలవని తెలియుచున్నది. 'మఱ్ఱిచెట్టు కథ, జలగన్న పార్వతికథ, రేణుక పుట్టుక, రేణుక కల్యాణము, లేక రేణుక రాయభారము, గిరిరాజు యుద్ధము, లేక రేణుక యుద్ధము, పరశురాముని జననము, పరశురాముని యుద్ధము, గవరమ్మ గాజులు లేక గొంతెమ్మకథ (గొంతాలమ్మకథ), జంపన్న వెలుగొండవెళ్ళుట' – అనునవి ఎల్లమ్మ కథాచక్రములోని వివిధ వీరగాథలు. వీనిని 'పరశురాముని కథలు' అనియు, 'గౌతుపురాణము' అనియు పిలుచుచుందురు.

పట్టిక - 3 :



జానపద కవిత్వము (Folk Poetry)
పల్లెపాటలు లేక జానపద గేయములు (Folk Songs)
వీరగాథలు లేక జానపద గేయకథలు (Ballads)
సాంప్రదాయిక వీరగాథలు (traditional ballads) లేక, జనప్రియ వీరగాథలు (popular ballads)
వీరగాథానుకరణములు (ballad - cycle)
వీరగాథాచక్రము (ballad - cycle)
వీరగాథలు ballads
వీరగాథానికలు, లేక లఘువీరగాథలు (balladlings)
బుఱ్ఱకథలు
జముకుల కథలు
సుద్దుల కథలు
తందనాన కథలు
బ్రతుకమ్మ పాటలు


వీరగాథాచక్రము (ballad - cycle)
శక్తి కథాచక్రము
పల్నాటి వీర కథాచక్రము
కాటమరాజు కథాచక్రము
ఎల్లమ్మ కథాచక్రము
అంకమ్మ కథాచక్రము
చౌడమ్మ కథాచక్రము
ఇతర శక్తి చక్రము


వీరగాథలు (ballad)
బొబ్బిలి వరుస కథలు
పదములు
జంగం కథలు
హరిహరీ పదములు
శారద పదములు

'అంకమ్మ కథ, రవద్దేవిరాజుకథ, గంగురాజుకథ, అనునవి అంకమ్మ కథాచక్ర సంబంధులైన వీరగాథలు వీనికి 'అంకమ్మ పాంగెము' అని జానపదులలో వ్యవహారము కలదు. ఈ రెండు కథాచక్రములను ఆదిశక్తి కథాచక్రములోని అంతశ్శాఖలుగా తలంపవలెను. చౌడమ్మ పాటలు లఘువీరగాథలనవచ్చును. ఈ లఘు కథలన్నింటిని వరుస క్రమమున కూర్చి ఒక పెద్ద ద్విపద పురాణముగా వ్రాయబడిన తాళపత్ర గ్రంథమును నేను చూచితిని. దానికి 'చౌడు పురాణము' అనిపేరు. అదియును వీరగాథాచక్రమే. పోలేరమ్మ కథవంటివి విడిగానున్న శక్తి కథలు.

పల్నాటి వీరకథాచక్రము (The Balled–cycle of Palnadu) :

వీరగాథాచక్రముల సర్వలక్షణములను పుణికి పుచ్చుకొన్నది పల్నాటి వీరకథా చక్రము. ప్రాచీన తాళపత్ర గ్రంథములలో ఈ కథాచక్రమునకు 'పలనాటి వీర భాగవతము' అను పేరు కానవచ్చుచున్నది. 'పల్నాటి వీరచరిత్ర' అను పేరు ఆధునికులు పెట్టినది. జానపదులు ఈ కథాచక్రమును 'చెన్నుడుకథ' అని పిలుచుచున్నారు. ఇది ఆంధ్రుల చారిత్రక వీరగాథాచక్రము. క్రీ.శ. 12వ శతాబ్దమున జరిగిన సంఘటన మిది. తెలుగున లభ్యమగుచున్న వీరగాథలలో ఇది ప్రాచీనతమమైనది. ఇంతకన్న ప్రాచీనములైన వీరగాథలు ఇతర భారత సాహిత్యములందును కానరావు. పంద్రెండవ శతాబ్దము కంటే ప్రాచీనమైన వీరగాథలు ప్రపంచమందెచ్చటను లేవని పాశ్చాత్య విమర్శకులు నిర్ణయించినారు. దీనిని బట్టి మన పల్నాటి వీరగాథల ప్రాశస్త్యము మరింత ప్రస్ఫుటమగుచున్నది.

పల్నాడు నేటి గుంటూరు మండలములో నొక ప్రాంతము. దీనిని క్రీ॥శ॥ 12వ శతాబ్దమున హైహయవంశపు రాజులు పాలించిరి. వీరు కార్తవీర్యార్జునుని సంతతివారు. పల్నాటి సీమను పాలించుటచే వీరిని పల్నాటి హైహయులందురు. వీరు ఆత్రేయ గోత్రజులనియు, ఇంటిపేరు 'చాగి' (సాగి) వారనియు తెలియుచున్నది. ఈ పల్నాటి హైహయవంశము క్రీ॥ శ॥ 1103 ప్రాంతమున 'మందడిరేవి నాయకుడు' అను సామంతునిచే స్థాపింపబడెను. ఈ వంశమున తెలియవచ్చు మొదటి పాలకుడు సాగిబేతరాజు (క్రీ॥ శ॥ 1103-1110).

ఈ పల్నాటి సీమను క్రీ॥శ॥ 1147 నుండి 1334 వరకును 'అనుగురాజు' (అలుగురాజు) అను హైహయుడు పాలించెను. ఇతని పుత్రులే నలగామరాజు, మలిదేవరాజు. వీరు సవతి తల్లుల బిడ్డలు. అనుగురాజు మరణానంతరము పల్నాటి రాజ్యము విభక్తమయ్యెను. నలగాముడు గురజాలను, మలిదేవుడు మాచెర్లను పాలింపదొడగిరి. శాసనములను బట్టి నలగాముని పాలనాకాలము క్రీ॥శ॥1147-1162. వీరగాథలను బట్టి యితడు 1182 తరువాత గూడ నుండెనని చెప్పవచ్చును. 'నాయకురాలు' నామాంతరముగల నాగమ్మ నలగాముని మంత్రిణి. బ్రహ్మనాయుడు మలిదేవుని మంత్రి నాగమ్మయు బ్రహ్మనాయుడును పరస్పరము స్పర్థాళువులగుటచే అంతర్యుద్ధము (civil war) జరిగెను. ఈ అంతర్యుద్ధము క్రీ॥శ॥ 1178-1182 మధ్యకాలమున జరిగెనని చారిత్రకులు నిర్ణయించిరి. ఇంకను కొందరు క్రీ॥శ॥ 1181 - 82వ సంవత్సరములో జరిగెనని నిర్ధారించిరి (చూడుడు పట్టీలు 4, 5, 6).

అనుగురాజునకు తన కూతురు మైలమదేవినిచ్చి పెండ్లిచేసి, పల్నాటి సీమను అరణముగానిచ్చిన 'చందవోలురాజు' - వెలనాటి రెండవ గొంకరాజు (రెండవ కులోత్తుంగచోడ గొంకరాజు) గా చారిత్రకులు నిర్ణయించిరి. ఇతని కాలము క్రీ॥శ॥ 1132-1161 ఇతని పుత్రుడు వెలనాటి చోడుడని నామాంతరముగల రెండవ చోడరాజు రెండవ కులోత్తుంగ రాజేంద్ర చోడయ), ఇతని కాలము క్రీ॥శ॥ 1161-1181 ఇతడు నలగాముని మేనమామ., పిల్లనిచ్చిన మామకూడ కావచ్చును. యుద్ధమున నితడు నలగామునకు సహాయము చేసినట్లు తెలియుచున్నది.

మలిదేవునకు పిల్లనిచ్చిన 'వీరసోముడు' కల్యాణమునేలిన కలచూరి బిజ్జలుని పుత్రుడగు సోమేశ్వరుడని చారిత్రకుల మతము. 'సోనిదేవ', 'రాయమురారి' అనునవి యీతని బిరుదములు. ఈ కలచూరి సోమేశ్వరుని కాలము క్రీ॥శ॥ 1165-1177 మలిదేవుని మామయగు ఈ వీరసోమునకు 'కొమ్మరాజు' అను పుత్రుడును, 'అలరాజు' అను పౌత్రుడును గలరని వీరగాథలను బట్టి తెలియుచున్నది. కాని చరిత్రలో కలచూరి సోమేశ్వరుని సోదరుల ప్రసక్తియున్నది కాని పుత్రపౌత్రులను గూర్చిన

పట్టిక - 4 :

పల్నాటి హైహయ రాజ వంశము (వీరగాథలనుబట్టి)



పట్టిక - 5 :


అనుగు రాజు
(ముగ్గురు భార్యలు)
పెంపుడు కొడుకు
పెద్దన్న బాదరాజు
(దొడ్డనాయని జ్యేష్ఠ పుత్రుడు)
(మైలమదేవికి)
నలగామరాజు
కూతురు : రత్నాల
పేరమ్మ
(భర్త : అలరాజు)
(భూరమాదేవికి)
కామరాజు
నరసింగ
రాజు
పెరుమాళ్ళ
రాజు
ఝట్టి
రాజు
(వీరవిజ్జలదేవికి)
పెదమల దేవుడు
(భార్య : సిరాదేవి)
బిరుదు రాజు
పినమలి దేవుడు
బాలమలి దేవుడు

బ్రహ్మనాయని వంశక్రమము (వీరగాథలను బట్టి)

కేతినాయుడు

భేతినాయడు

దొడ్డనాయడు (జమదగ్ని అవతారము)
భార్య : శీలమ్మ (రేణుక అవతారము)

- పెద్దన్న బాదరాజు
  భార్య :లఘువాంబ
  (అనుగు రాజునకు
  దత్తపుత్రుడు)
- బ్రహ్మనాయడు
  (పరశురాముని అవతారము)
  భార్య : ఐతమ్మ
  - బాలచంద్రుడు
    భార్య : మాంచాల
- పేర్నీడు భార్య : గౌరాంబ
  (వీరు బాలచంద్రుని
  రహస్యముగా సాకిన
  దంపతులు)
- సూర్నీడు
- మలినీడు

వివరము లేవియును లేవు. కనీసము నామములైననులేవు. నాకు లభించిన తాళపత్ర గ్రంథములలో వీరసోముడు "చోడవంశమునందు శోభిల్లురాజు, కాశ్మీరు గోత్రమున ఘనమైన రాజు" అని వర్ణింపబడినాడు.

పల్నాటి వీరకథలలో ఎక్కువ భాగము బ్రహ్మనాయనియందు పక్షపాతమును జూపుచు వ్రాయబడినట్టివే. ఇవి బ్రహ్మనాయని అవతార పురుషునిగా చిత్రించినవి. ఈ చిత్రణము నమ్మదగినదికాదు. బ్రహ్మనాయనియందును కొన్ని లోపములున్నవి. అతని శీలము నందును కొన్ని నీలినీడలు కానవచ్చుచున్నవి. ఇట్టి నీలినీడలను ప్రదర్శించు వీరగాథలు నాకు లభించినవి. బ్రహ్మనాయుడు, అనుగురాజును తన తండ్రియగు బొడ్డనాయని సంహరించి, నలగామునిసింహాసనమెక్కించెనని sewell అను చరిత్రకారుడు వ్రాసినాడు. దీనిని సమర్థించు వీరగాథ నాకు లభించినది. ఇట్లే అలరాజు మరణమునకు బ్రహ్మనాయుడే ముఖ్యకారకుడని నిరూపించు వీరగాథ కూడ నాకు పల్నాటిలో లభించినది. బ్రహ్మనాయడు, తన కంటెను, తన అన్నయగు పెద్దన్న బాదరాజు కంటెను మహాబలశాలియగు అలరాజును ఏ విధముగానైనను చంపిచవలెనను కుట్రతో అతనిని గురజాల రాయబారమునకు పంపినాడని యీ వీరగాథలో నున్నది.

నాగమ్మ, వీరగాథలలో చిత్రింపబడినట్లు దుష్టురాలును, నీచురాలునుగాదు. ఆమె అనల్పమగు రాజకీయ ప్రజ్ఞ కలిగిన బుద్ధిశాలిని! 'నాయకురాలు' ఆమెకు అన్వర్థ నామధేయము! ఈ నాయకురాలికిని బహ్మనాయునికిని మధ్యగల రాజకీయస్పర్థలే పల్నాటి యుద్ధమునకు మూలకారణములు కాని, శైవవైష్ణవ మత భేదము లెంతమాత్రమును కాజాలవు. అసలు అట్టి భేదములు ఆ కాలములో లేవు. బ్రహ్మనాయడు శివుని బంగారు పువ్వులతో పూజించు అగ్రశ్రేణికి చెందిన శివభక్తుడు!

వీరగాథలను బట్టి బ్రహ్మనాయడు జయించినట్లుగా కనబడుచున్నను, స్థానిక చరిత్రలను బట్టి నలగాముడే జయించినట్లు తెలియుచున్నది. యుద్ధావసానమున బ్రహ్మనాయడు నలగామునకు మరల పట్టము కట్టినట్లుగ కొన్ని వీరగాథలలో గలదు. మరికొన్ని వీరగాథలలో నలగాముడు కొమ్మరాజుచే చంపబడెనవియు,

యుద్ధానంతరము బ్రహ్మనాయుడు, కన్నమదాసు-వీరిరువురే మిగిలిరనియు, బ్రహ్మనాయుడు యుద్ధమున మరణించిన వీరులందరిని బ్రతికించి, వారితో గుత్తికొండ బిలమును ప్రవేశించెననియుగలదు. ఈ యుద్ధముతో పల్నాటి హైహయవంశము అంతరించెనని చెప్పవచ్చును. తరువాత ఈ పల్నాటి ప్రాంతమును కాకతీయులు ఆక్రమించిరి.

ఈ యుద్ధమున మలిదేవుని పక్షమున పోరిన పెద్దన్న, కొమ్మరాజు, బ్రహ్మనాయుడు, కన్నమదాసు, బాలచంద్రుడు మున్నగు వీరులకు మాత్రమే 'పల్నాటి వీరులు' అని పేరు. నలగాముని పక్షమున పోరిన వీరులకు ఈ పదము వర్తింపదు. ఈ పల్నాటి వీరుల సంఖ్య అరువదియారు అనుటకు ఎక్కువ ప్రమాణము లున్నవి.

పల్నాటి వీరగాథాచక్రములో ఒక్క బాలచంద్రుని కథ మాత్రమే పండిత లోకములకు పరిచితమైనది. దీనిని మొట్ట మొదట ప్రకటించిన వారు అక్కి రాజు ఉమాకాంతంగారు. ఇది శ్రీనాథ విరచితము. పింగళి లక్ష్మికాంతంగారు పరిష్కరించిన పల్నాటి వీరచరిత్రలో పదునొకండు వీరగాథలున్నవి. కాని నా పరిశోధనము వలన ఈ కథాచక్రమున సుమారు ఇరువదియైదు వీరగాథ లున్నవని తేలినది. వీనిలో పెక్కు కథలు తాళపత్ర గ్రంథములందు చివికిపోవుచు, గాథాకారుల జిహ్వాగ్రములందు కొనయూపిరితో నున్నవి. శ్రీనాథుడు, మల్లయ్య, కొండయ్య అను కవులు రచించిన వీరగాథలు కొన్ని నేడు లభించుచున్నవి. ఈ కవులలో ఒక్కొక్కరు ప్రత్యేకముగా ఈ గాథాచక్రమంతటిని వ్రాసియుందురు. కాని యిట్లు ప్రత్యేకముగా ఒకే కవి విరచితముగానున్న సంపూర్ణ గాథాచక్రమేదియు నేడు లభించుటలేదు. కొన్నివీరగాథలు ఒక కవివి, మరికొన్ని వీరగాథలు వేరొక కవివి లభించుచున్నవి. నాకు శ్రీనాథ విరచితములైన వరుసక్రమమున నున్న పది కథలు లభించినవి. అక్కిరాజు వారికి పై ముగ్గురు కవులు రచించిన మూడు రకముల బాలచంద్రుని కథలు లభించినవి.

1962 ప్రాంతమున పల్నాటిలో నున్న ముదిగొండ వీరభద్ర కవి అనునతడు, పల్నాటి వీరగాథల నన్నిటిని అనుసరించి 'వీరభాగవతము' అను పద్యకావ్యమును

రచించెను. పల్నాటి వీరగాథాచక్రము యొక్క సంపూర్ణేతి వృత్తమును తెలిసికొనుటకు ఈ పద్య కావ్యము మిక్కిలిగ తోడ్పడుచున్నది. మదరాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునను, తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనా సంస్థ లిఖిత పుస్తక భాండాగారమునను, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషద్గ్రంథాలయమునను, గుంటూరు నెల్లూరు మండలములలో నున్న 'వీరవిద్యావంతు' లనెడి గాథాకారుల కడను పల్నాటి వీరగాథలకు సంబంధించిన తాళపత్ర గ్రంథములు పెక్కుగలవు.

గుంటూరు నెల్లూరు మండలములలో పర్యటింపగా నాకు ఇరువది వీరగాథలున్న మూడు పెద్ద పెద్ద తాళపత్ర గ్రంథములు లభించినవి. వీనిలో పెక్కు గాథలు సాహిత్య లోకమునకు పరిచయము లేని వినూత్న వీరగాథలు! పింగళి లక్ష్మీకాంతంగారు పరిష్కరించిన, విజయవాడ విశాలాంధ్ర ప్రచురణాలయము వారు 1961లో ప్రకటించిన 'పల్నాటి వీరచరిత్ర'లో 'కల్లుప్రతిష్ఠ', 'బాలచంద్రుని యుద్ధము' అను రెండు వీరగాథలు తప్ప తక్కిన వన్నియును మిక్కిలి సంక్షిప్త రూపములు. ఇవి విశ్వసింపదగినవి కావు. వీనికిని, జానపదులలో వ్యాప్తి యందున్న పల్నాటి వీరగాథలకును ఏ విధమగు సంబంధమును లేదు. నేను పరిశీలించినంత వరకును, పల్నాటి వీరగాథాచక్రమున ఈ క్రింది వీరగాథలున్నవని తెలియుచున్నది.

1. పెద్దన్న పెళ్ళిరాయబారము లేక పెద్దన్న బాదరాజు పెళ్ళి కథ.
2. బ్రహ్మనాయుడు పుటక.
3. యాత్రకథ లేక దక్షిణాది యాత్రకథ.
4. పేర్నీడు యుద్ధము లేక పేర్నీడు చందోలు యుద్ధము.
5. తెప్పలినేడు యుద్ధము లేక తెప్పలినేడు ఊరకోట యుద్ధము.
6. ఆరణగండ్ల యుద్ధము లేక బ్రహ్మనాయని ఆరణగండ్ల యుద్ధము.
7. నాయకురాలి కథ (దీనిలో అనుగురాజు మరణము వరకును ఒక కథ, తరువాత బ్రహ్మన మాచెర్ల కేగుట వరకును వేరొక కథ కావచ్చును).
8. అనుగురాజు మరణము లేక మైలమ్మ సాగుమానము.
9. రాచగావు కథ లేక శివనందుల కోట దోపు.

10. రాజుల పెళ్ళికథ.
11. బాలుని పుటక (వివాహమును ఇందే కలదు).
12. కోడి పోరు - గోపు ఒరుగు: ఇది పెద్ద వీరగాథ. దీనిలో మరల ఐదు కాండలు గలవు: (i) ఒప్పందము, (ii) అర్ధనాల చిట్టి మల్లుడు కథ లేక రావీపడాలు కోడిని దెచ్చేకాండ, (iii) కోడిపూర్వజన్మ, (iv) బాలగోపన్న కోడి పందెము లేక పాలవాయి కోడి పందెము, (v) కన్నమనేని యుద్ధము గోపు సంస్కారము.
13. మండాది వలస కథ.
14. మందపోటు కథ - లంకన్న ఒరుగు
15. గురజాల యుద్ధము.
16. అలరాచమల్లుగారి గురజాల రాయబారము.
17. కల్లు ప్రతిష్ఠ.
18. బాలునికథ : ఇది సుదీర్ఘమైన వీరగాథ. దీనిలో మరల ఎనిమిది కొండలు గలవు: 1) బొంగరంపుటక, 2) బొంగరాలాట, 3) అంతర్వేదిగాని కథ, 4) సబ్బాయి చాటువ, 5) మాంచాల మేడసవరణ, 6) అనపోతురాజు ఒరుగు, 7) మేళ్ళవాగు యుద్ధము 8) కారెంపూడి యుద్ధము.
19. బాలుని యుద్ధము-ఉత్తరకాండము-మరణము.
20. గుఱ్ఱాల సవరణ లేక గుఱ్ఱాల చాటువ.
21. అమ్మవారి పుటక.
22. కొమ్మరాజు యుద్ధము.
23. పేర్నీడు సన్నిగళ్ళ యుద్ధము.
24. కన్నమనీడు చింతపల్లి యుద్ధము.
25. కల్లిపాడుకథ లేక కల్లిఒరుగు (బ్రహ్మన్నవిరుగు).

ఈ పల్నాటి కథలను పిచ్చుకుంట్లు పాడుదురనుట తప్పు. పిచ్చుకుంట్లకు ఈ కథలను పాడెడి హక్కులేదు. వీనిని పాడువారు 'వీర విద్యావంతులు' అనబడె

మాలలు, వీరిని 'పల్నాటివారు' అనియు పిలుచుటకలదు. వీరు గుంటూరు, నెల్లూరు మండలములలో వ్యాపించియున్నారు. ఈ వీరగాథాగానమున వీరజోడు (పంబజోడు), తిత్తి, కత్తి, డాలు ఉపయోగింతురు. ప్రధాన గాథకుడు పల్నాటి వీరునివలె పంన్రెండు బిరుదములతో వేషమును ధరించును. ఈ వీర విద్యావంతులకు యుద్ధక్షేత్రమగు కారెంపూడిలో గురుపీఠము కలదు. పిడుగువారను నియోగి బ్రాహ్మణులు దీనికి అధిపతులు. వీరిని 'పల్నాటి వీరాచార పీఠాధిపతులు' అందరు. పల్నాటి వీరారాధనము ఒక ప్రత్యేక మతముగా ఆచరింపబడుచున్నది. ఈ వీరారాధకులు అన్ని కులములలోను గలరు. వీరిని ఆచారవంతులు' అందురు. వీరందరికిని పీఠాధిపతియే గురువు. యుద్ధక్షేత్రమగు కారెంపూడిలో పల్నాటి వీరుల గుడియున్నది. దీని దగ్గర ప్రతి సంవత్సరమును కార్తిక మాసములో వీరోత్సవము జరుగును.

కాటమరాజు కథా చక్రము (The Ballad–cycle of Katama Raju) :

ప్రాచీనమును పశ్రస్తమును అగు చారిత్రక వీరగాథలలో పల్నాటి వీరకథల తరువాత ఎన్నదగినవి కాటమ రాజుకథలు. ఇవి యొక సుదీర్ఘకథాచక్రముగా నేర్పడియున్నవి. కాని పల్నాటి వీర కథలను గూర్చి జరిగినంత పరిశోధనము వీనిని గూర్చి జరగలేదు. అందుచే ఈ వీరగాథావృత్తములోని పెక్కుగాథలు సాహిత్య లోకమునకు అపరిచితములుగ నుండిపోయినవి. తెలుగు వీరగాథలలో ఇంత పెద్ద 'గాథావృత్తము' (ballad - cycle) మరియొకటిలేదు. దీనిలో మొత్తము ముప్పదిరెండు వీరగాథలు కలవని నా పరిశీలనమువలన తెలిసికొంటిని. యథాక్రమమున వాని నామములు.

1. వల్లురాజు కథ (వలురాజు కథ లేక ఆవుల వలురాజుకథ).
2. పంపాద్రి కథ.
3. పెద్దిరాజు కథ.
4. సింహాద్రిరాజు కథ.
5. ఎరనూకరాజు కథ.

6. నలనూకరాజు కథ.
7. పోలురాజు కథ: దీనిలో మరల ఆరు అంతర్భాగములున్నవి:
    1) చంద్రగుప్తుని చాటున
    2) మల్లికాదేవి చాటున
    3) ముక్కంటి చాటున లేక బ్రహ్మణచాటున
    4) జంగాల చాటున
    5) కపోత చాటున
    6) గయాడు చాటున
8. బల్లికురువ పోట్లాట.
9. కరియావులరాజు కథ.
10. కాటమరాజుకు పట్నంకట్టిన కథ లేక కాటమరాజు పట్టాభిషేకము.
11. పాపనూక కథ.
12. ఆవుల మేపు: (దీనికి మూడు నామాంతరములు కలవు. 'ఉత్తరాది అవులమేపు' – 'కాడమరాజు ఉత్తరాది ఆవులమేపు'– 'ఆవుల మేపులు : ఉత్తర కాండము)'.
13. పాలేటి కథ లేక గంగతర్కము లేక గంగ – కాటమరాజు తరకవాదము.
14. ఎఱ్ఱయ్య తరకవాదము.
15. జన్నివాడ కథ: (దీనికి నాలుగు నామాంతరములున్నవి.) 'దక్షిణాది ఆవుల మేపు'–'ఆవుల మేపులు: దక్షిణకాండము' – 'చదరంగం కథ' – పుల్లరికథ'.
16. భట్టు రాయబారము లేక కల్లి రాయబారము.
17. కోటిపాటి తాటివృక్షం తెచ్చే కథ.
18. బొంగరాల కథ. (దీనికి మూడు నామాంతరములు గలవు: 'ముమ్మయ్య పోచయ్య బొంగరాలు', 'వేడుక బొంగరాల కథ', 'అలుగులపోలు').
19. ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట: దీనిలో ఏడు కాండలున్నవి:
    1) చల్లవారి జగడము, లేక 'ఈర్లమానికథ', లేక తిక్క నామాత్యుని కథ'

2) బొల్లావు జగడము

3) బీర్నీడు యుద్ధము

4) కరియావుల రాజు యుద్ధము

5) బాలరాజుల యుద్ధము

6) ఆవుల యెద్దుల జగడము-ఎల్లయ్యల యుద్ధము

7) కాటమరాజు యుద్ధము

20. అగుమంచి కథ.

21. భక్తిరన్నకథ.

ఈ కథలన్నియు తాళపత్ర రూపమున యాదవ గాథాకారుల యిండ్లలో నున్నవి. ఇవికాక, 'పాప నూకవలపోత', 'అగుమంచి వలపోత', 'పల్లి కొడపుటక', 'గంగపుటక', 'భైరవ కురువ యుద్ధము' - అను కథలు కూడ ప్రచారమున నున్నట్లు తెలియుచున్నది.

కాటమరాజు చంద్రవంశ క్షత్రియుడు. ఇతడు విష్ణుమూర్తికి డెబ్బది నాల్గవ తరము వాడనియు, శ్రీకృష్ణునికి ఇరువది మూడవ తరము వాడనియు కొన్ని వీరగాథలలో నున్న వంశవృక్షములనుబట్టి తెలియుచున్నది. ఈ సుదీర్ఘ వీరగాథా చక్రమున కాటమరాజు పితామహుడగు ఆవుల వలురాజు నుండి కాటమరాజు వరకును - మూడు తరములకు సంబంధించిన ముప్పది రెండు వీరగాథలున్నవి. ఈ వీర గాథలన్నియు పరస్పర సంబంధము కలిగి, చక్కని వరుసక్రమములో ఒక పెద్ద యితిహాసము (epic) వలె నున్నది.

'ఎలమంచి'ని పాలించెడి 'కవులావుల గంగు రాజు' నకు 'గంగమ్మ' యను భార్యయందు 'వలురాజు, హరిపాలుడు, నందగోపాలుడు, గోవర్ధనుడు' - అను నల్వురు పుత్రులు కలిగిరి. వీరందరు 'ఖండె మొండెముల కోట' నేలు 'కలభూత గంగురాజు'తో యుద్ధము చేసి మరణించిరి. ఆవుల రాలురాజు భార్య 'వల్లమ్మ'. ఈ దంపతులకు 'సింహాద్రిరాజు, పెద్దిరాజు, ఎరనూకరాజు, పోలురాజు, అను ఐదుగురు పుత్రులును, 'కొమరమ్మ' లేక 'కొమరక్క' అను కుమార్తెయు పుట్టిరి.

వల్లురాజు తరువాత జ్యోతిష్కుల ఆదేశమునుబట్టి ద్వితీయ పుత్రుడగు పెద్దిరాజు సింహాసన మెక్కెను. ఇతడు ఎలమంచిని పదేండ్లు పాలించెను. తరువాత ఇతడు సోదరులతో పంపాద్రికి తరలివచ్చెను. పంపాద్రిలో ఏడేండ్లు పాలించెను.

పెద్ది రాజునకు తప్ప తక్కిన అన్నదమ్ములందరకును సంతానము కలిగెను. పెద్దిరాజును అతని భార్య పెద్దమ్మయు సంతానార్థమై కల్యాణపట్టణములోనున్న సోమేశ్వరుని సేవింపబోయిరి. అట పెద్దిరాజునకు 'కాటమరాజు' అను పుత్రుడును, 'సాపనూక' అను పుత్రికయు కలిగిరి. పాపనూక దుష్టనక్షత్రమున జన్మించినది. అందుచే పెద్దిరాజు వాలికేతువ రాజుతో యుద్ధముచేసి 'ఆర్లపెంట' రణరంగమున నిహతుడయ్యెను. ఏడేండ్ల బాలుడైన కాటమరాజు వాలికేతువరాజుపై, ఆతనిని చంపి, తండ్రిపగ తీర్చుకొనెను. పెద్దమ్మ సహగమనము చేసెను.

సరిగా పెద్దిరాజు మరణించు సమయమునకే అతని సోదరులు నలుగురును, వివిధ స్థలములలో, పరోపకారార్థము యుద్ధములు చేసి తమతమ శరీరములను త్యజించిరి. సింహాద్రిరాజు శ్రీకూర్మముపై దండెత్తి సింధుబళ్ళాని రాజుతోపోరి చనిపోయెను, ఎరనూకరాజు ఏనుగనాథుని కొండకుపోయి ఎఱ్ఱభూపతితో యుద్ధము చేసి చనిపోయెను. నలనూకరాజు నున్న బెజవాడకుపోయి, దానిని పాలించు నందికేశవ రాజుతో పోరి మరణించెను. పోలురాజు చెఱుకూరి దగ్గర, శ్రీరంగపట్టణమేలు చోడనిచే పంపబడిన ముక్కంటితో యుద్ధము చేసి మడిసెను.

సింహాద్రి రాజు భార్య 'సింహాద్రి సీత'. ఈ దంపతులకు 'కరియావుల రాజు' అను కొడుకును, 'చిట్టినూక' అను కూతురును పుట్టిరి. కరియావుల రాజు ఓరుగంటి ప్రతాప రుద్రుని సేనానియగు బేతాళునితో ఏకాంగి కయ్యముచేసి జయించెను. ఇతని భార్య పేరు 'నాగమాంబిక' లేక 'కరియావులనాగ'. చిట్టి నూక భర్త పేరు 'కల్లందులపోలినెడు'. ఇతడు భైరవ కురువ యుద్ధములో చనిపోయినాడు. చిట్టినూక భర్తతో 'సాగుమానము' చేసినది. ఈ దంపతులకు 'పోచయ్య' అను పుత్రుడు కలడు.

ఎరనూక రాజు భార్య 'ఎరనూక సీత', పుత్రుడు 'భట్టావుల రాజు'. ఇతడు ఓరుగల్లు బేతాళుని తమ్మునితో ఎక్కటి కయ్యము చేసి అతనిని పరిమార్చినాడు. ఇతని భార్యపేరు 'సూరమ్మ ' లేక 'సూరమాంబిక'.

నలనూక రాజు భార్య 'నలనూకసీత'. వీరి కొడుకు 'పెయ్యల ఎఱ్ఱయ్య'. ఇతడు పాలేటికడ గంగతో వాదించెను. ఇతని భార్య 'భయ్య మాంబిక'.

పోలురాజు భార్య 'సిరిదేవి'. వీరికి 'భక్తిరన్న, 'అయితమరాజు' ముమ్మయ్య' అను ముగ్గురు కొడుకులును, 'అగుమంచి' లేక అక్కన్న అను కూతురును గలరు. 'పల్లికొండ' పోలురాజునకు మంత్రి. పోలురాజు చెరుకూరి కడ మరణింపగా పల్లికొండ బాలరాజులను తీసికొని పంపాద్రికి పోవుచుండెను. మార్గమధ్యమున బల్లికురువ దగ్గర ముక్కంటి మనుమలు బాలరాజుల నెదిరించిరి. పల్లికొండ బొల్లావును ప్రార్థింపగా, అదివచ్చి శత్రువులను తరమివేసినది.

పోలురాజు పుత్రులలో అయతమరాజు దొనకొండకు పాలకుడయ్యెను. పెద్దవాడగు భక్తిరన్న ('బత్తినన్న' అని జానపదుల ఉచ్చారణ) కాశికిపోవుచు, కల్యాణ పట్టణములో నున్న కాటమరాజును, పాపనూకను తెచ్చి దొనకొండలోనుంచెను. విష్ణుస్వరూపుడగు కాటమరాజునకు గోగణము నంతటిని ఇచ్చి పట్టముకట్టిరి. అతడు శ్రీశైల ప్రాంతమున పశువులను మేపుకొనుచుండెను. పెయ్యల యెఱ్ఱయ్య, పద్మరాఘువుడు అతనితో నుండిరి. పాపనూక దుష్టనక్షత్రమున జన్మించుటచే ఆమెను దొనకొండ నగరము బయట నొకమేడలో నుంచిరి.

భక్తిరన్న భార్య 'నల్లమేడ' లేక 'నల్లమాంబ'. ఈ భక్తిరన్న కాశికి బోయి వల్లురాజునకును, పెద్ది రాజాదులకును, వారివారి భార్యలకును, మంత్రులకును, మంత్రుల భార్యలకును గయలో పిండప్రదానము చేసెను. ఇతడు కాశిలో నుండగా, కాటమరాజాదులు ఎఱ్ఱగడ్డపాటి పోట్లాటలో కూలిరని తెలిసి, వెంటనే మేఘరథములో దొనకొండకు వచ్చి, పాపనూకను మేడనుండి తప్పించి, యాదవకాంత లందరికిని సహగమనము చేయనాజ్ఞాపించి, తాను ఎఱ్ఱగడ్డ పాటికి పోయి సోదరులకును ఇతర బంధువులకును పాలేటిలో పిండప్రదానము చేసెను.

అయతమరాజు దొనకొండకు పాలకుడు. ఇతని భార్య 'నేతివారిపోతు'. ఈ దంపతులకు 'అల్లుదాడెన్న ' అను కొడుకును, 'సిరిగిరమ్మ' అను కూతురును గలరు. యుద్ధ సమయమున తమ వంశాకురమును నిలుపుకొనుటకై యాదవులు ఈ అల్లు

దాడెన్నకు కొంత సైన్యమును సహాయముగానిచ్చి కటకమునకు పంపివేసిరి. అయితమ రాజు తన పుత్రికయగు సిరిగిరమ్మను చిట్టినూక కుమారుడగు పోచయ్య కిచ్చి పెండ్లి చేసెను. పోలురాజు తృతీయ పుత్రుడగు ముమ్మయ్య భార్య పేరు 'చిన్నమల్లు'. ఈ ముమ్మయ్యయు పోచయ్యయు యుద్ధ సమయమున దొనకొండలో బొంగరము లాడుచుందురు.

పోలురాజు పుత్రికయగు అగుమంచి లోకోత్తర సౌందర్యవతి. ఈమె భర్తపేరు పుత్తమరాజు. ఇతడు ఈమెకు మేనత్తకొడుకు (కొమరమ్మ పుత్రుడు). ఈ పుత్తమరాజు ఓరుగల్లులో ప్రతాపరుద్రుని పెంకె గుఱ్ఱమును స్వారిచేసిన వీరుడు. అగుమంచి - పుత్తమ రాజుల పెంపుడు కొడుకు పోచయ్య, పోచయ్య పసిబాలుడుగా నున్నప్పుడు అతని తల్లియగు చిట్టినూక భర్తతో సహగమనము చేసినది. అందుచే ఆ బాలుని అగుమంచి పెంచి పెద్ద చేసినది.

పెద్దిరాజాదుల సోదరియగు కొమరక్క లేక కొమరమ్మ భర్త పేరు 'పందుముల పాపినాయుడు' ఇతడు పోలురాజుకడ మంత్రి. పల్లికొండ ఈ కొమరక్కకు పెంపుడు కొడుకు. 'పుత్తమరాజు', 'నాచకూళ్ళనాయుడు' కొమరక్కకు నిజపుత్రులు. 'చుట్టువారి ఎఱ్ఱయ్య', 'పుల్లావుల కేశవయ్య' అను మరి యిరువురు కూడ ఈమె పుత్రులుగా వీరగాథలను బట్టి తెలియుచున్నారు. కొమరమ్మ సంతతిలో పల్లికొండ వరపుత్రుడు. ఇతడు మొదట వల్ల్వరాజునకును, తరువాత పోలురాజునకు, పిమ్మట అయితమ రాజునకును మంత్రిగా నున్నట్లు తెలియుచున్నది. చట్టువారి ఎఱ్ఱయ్య కోటపాడు నుండి తాటి వృక్షమును పెకలించి తెచ్చిన మహావీరుడు. నాచకూళ్ళ నాయుడు పాపనూకను పెండ్లాడవలసిన వాడు. కాని ఆమె దుష్టనక్షత్రమున జన్మించుటచే ఆ పెండ్లి తప్పిపోయినది. (చూడుము-పట్టీ 7)

శ్రీశైలము కడ ఆవులను మేపుచున్న కాటమరాజు, అక్కడ క్షామము వచ్చుటచే దక్షిణ భూములకు తరలివచ్చుచుండెను. కనిగిరి సీమలో పాలేటి యొడ్డున గంగతో కాటమరాజు తర్కవాదమును జరపినాడు. మొదట వ్యతిరేకించినను చివరకు ఆమెకు చేయెత్తి మ్రొక్కినాడు. ఆలమందతో నెల్లూరి సీమను ప్రవేశించి, నల్లసిద్ధి రాజుతో

పట్టిక – 7 :

కాటమరాజు వంశవృక్షము (వీరగాథలను బట్టి)




(నాగ మాంబిక)
కల్లందుల పోలినేడు)
(మర్ల వారి గంగ లేక వీరగంగ)
ఎరనూకసీత
(భయ్య మాంబిక)
సిరిదేవి
భర్త : పందుముల పాపనాయుడు
పల్లికొండ
పుత్తమ్మ రాజు
చుట్టు వారి ఎల్లయ్య (?)
నాచ కూళ్ళ నాయుడు
పుల్లా కౌశ పయ్య(?)
భట్టావుల వల్లభన్న లేక భట్టావులరాజు (సూరమాంబిక)
పోచయ్య (భార్య : సిరిగిరమ్మ)
(భక్తిరన్న (నల్లమాంబ)
అయితమరాజు నేతివారిపోతు
ముమ్మయ్య (చినమల్లు)
అగుమంచి (భర్త : పుత్తమరాజు)
అల్లుదాడెన్న
సిరిగిరమ్మ (భర్త : పోచయ్య)

పుల్లరి ఒప్పందము చేసికొనెను. తన ఆలమందకు బోయలచే నష్టము వాటిల్లుటచే, నల్లసిద్ధికి పుల్లరినీయక, తిరిగి ఎఱ్ఱగడ్డపాటికి వచ్చెను. నల్లసిద్ధిరాజుపంపిన భట్టురాయబారము ఫలించలేదు. ఎఱ్ఱగడ్డ పాడులో జరిగిన ఘోర యుద్ధములో కరియావుల రాజు - ఎఱ్ఱసిద్ధిరాజు తోను, భట్టావులన్న -పాపసిద్ధిరాజుతోను, అయితమరాజు - గండగోపాలరాజు కస్తూరి రాజులతోను, ముమ్మయ - ఉండవెల్లి విరిగోవు తోను, నాచకూళ్ళనాయడు - గుత్తిభీమునితోను, పోచయ్య - తిర్ణమల తిప్పయ్యతోను, కాటమరాజు - నల్లసిద్ధిరాజుతోను పోరాడిరి. కడకు యుద్ధమున యాదవుల జయించిరి. కాటమరాజు తనపగతీర్చుకొనెను.

ఈ కథాచక్రమున నల్లసిద్ధిరాజు, ఖడ్గతిక్కన చారిత్రక వ్యక్తులు. ఓరుగంటి ప్రతాపరుద్రుని ప్రసక్తిగల వీరగాథలును నాకు లభించినవి. పల్నాటి యుద్ధము క్రీ॥శ॥12వ శతాబ్ది చతుర్థపాదమున జరుగగా, కాటమరాజు ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట క్రీ॥శ॥13వ శతాబ్ది చతుర్థపాదమున జరిగినది. ఇది కాకతీయ మహారాజ్ఞి రుద్రమదేవి పాలనాకాలము చివరిభాగమున, అనగా ప్రతాపరుద్రుడు యువరాజుగా నున్నప్పుడు జరిగినదని శాసనాధారములనుబట్టియు, వీరగాథలను బట్టియు తెలియుచున్నది. అనగా కాటమరాజు - నల్లసిద్ధిరాజుల యుద్ధము క్రీ॥శ॥ 1280-1297 మధ్య కాలములో జరిగినది. మనుమసిద్ధియే నల్లసిద్ధియనుట సరికాదు. మనుమసిద్ధి పుత్రుడు నల్లసిద్ధి. ఇతడు నెల్లూరును పాలించిన తెలుగు చోళుడు. ప్రతాపరుద్రుని యౌవరాజ్య కాలమే (క్రీ॥శ॥ 1280-1296) నల్లసిద్ధికాలము. ఈ నల్లసిద్ధియే కాటమరాజునకు ప్రత్యర్థి.

నెల్లూరు రాజ్యములోని పచ్చిక బీళ్ళలో తన గోగణమును మేపుకొనుటకు కాటమరాజు నల్లసిద్ధితో పుల్లరి ఒడంబడికను చేసి కొనెను. నెల్లూరి సీమలో నున్నంతకాలమును తన మందలో పుట్టిన కోడెదూడలను నల్లసిద్ధికి ఇత్తునని ఒప్పుకొనెను. కాని అతడు ఒడంబడికనుమీరి పచ్చిక బీళ్ళనే కాక, వరిపొలములను సహితము మేపివైచెను. నల్లసిద్ధి భార్యకుందమాదేవి, బోయలచే కాటమరాజుగారి ఆలమందను పొడిపించెను. నల్లసిద్ధికి ఈ విషయము తెలియదు. ఈ గోహత్య

నల్లసిద్ధియే చేయించెనని కాటమరాజు భావించి, దానికి ప్రతిక్రియగా పుల్లరి నెగవేసెను. అందుచే ఇరువురకును యుద్ధము సంభవించెను.

ఈ కాటమరాజు కథాచక్రమును శ్రీనాథుడు రచించినట్లుగా జనశ్రుతియేకాక, కొందరు గాథాకవుల వాక్యములును సాక్ష్యమిచ్చు చున్నవి. కాని శ్రీనాథుని పేరుతోనున్న వీరగాథ ఒక్కటి కూడ నేడు లభించుటలేదు. గంగుల పినయెల్లయ రచించిన ఎఱ్ఱగడ్డపాటి పోట్లాటను వేటూరి ప్రభాకరశాస్త్రిగారు పరిష్కరించిరి. ఇందుమూడు వీరగాథలున్నవి. మద్రాసు, తిరుపతి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములలో ఐదు కథలు మాత్రమేకలవు. తక్కిన కథలన్నియును ప్రజలలోనే యున్నవి. నేను సుమారుగ ఇరువది కథలకు సంబంధించిన తాళపత్ర గ్రంథములను సంపాదించితిని. ఈ ప్రతులవలన పైన తెల్పిన గంగుల పినయెల్లయతోపాటు మరి ఆరుగురు ప్రాచీన జానపదకవులు వెలుగునకు వచ్చిరి. వారిపేర్లు: "మద్దులేటికవి, మల్లయ్య, కనబండి ఘట్టయ్య, కట్టెబోయిన మారయ్యకవి, మంగళపురి వెంకటాద్రి, పల్యాచెన్నయ్య".

ఈ కాటమరాజు కథలను 'కొమ్ములవారు' అను మాదిగలు పాడుచుందురు. వీరు యాదవులను యాచించి జీవింతురు. మాదవులలో కొన్ని శాఖలవారు కూడ ఈ కథలను పాడుచున్నారు. వీరిని 'సుద్దులగొల్లలు' 'తెరచీర భక్తులు' అను నామములతో వ్యవహరింతురు.

యాదవుల కులదైవము గంగ. ఈమె ఆంధ్రదేశమునగల ప్రధాన గ్రామ దేవతలలో నొకతె. కొన్ని గ్రామములలో ఈ గంగకు జాతరలు అతివైభవముగా జరుపుదురు. ఇట్టిగంగ జాతరలలో కాటమరాజు కథలను పాడుట ఆచారము.

ఎల్లమ్మకథలు, అంకమ్మకథలు, పల్నాటి వీరకథలు, కాటమరాజు కథలు - అను ఈ నాలుగు వీరగాథాచక్రముల లోను సంవాది సంఘటనలు హెచ్చుగానున్నవి. తెలుగులో ఈ నాలుగు గాథాచక్రములతోపాటు రాయలసీమలో జంగములు పాడుచున్న 'వెలకంటి వీరుని కథాచక్రమొకటి వ్యాప్తియందున్నదని తెలియుచున్నది.

బొబ్బిలి వరుస కథలు :

నెలల తరబడి పాడబడు వీరగాథా చక్రముల తరువాత, రెండు మూడు

రాత్రులలో పాడబడు వీరగాథలను పరిశీలింపవలసియున్నది. ఈ వీరగాథలలో 'బొబ్బిలి వరుస కథలు' పదములు, జంగంకథలు' అను మూడు ప్రధాన విభాగములను గుర్తింపవచ్చును. బొబ్బిలి రథవరుసలోను (8+8+9 లేదా 10 మాత్రలొక పాదము), తద్భేదములలోను (8+8 గాను, గాను, లేదా 8+9(10) గాను) ఉండు వీర గాథలన్నియును 'బొబ్బిలి వరుస కథలు' అనబడును. ఇవి యెక్కువగా చారిత్రక సాంఘిక సంఘటనా జనితములు, "హరిహరీనారాయణాది నారాయణా! కరుణించి మమ్మేలు కమల లోచనుడా!" అను జంపె వరుసలో నుండు కథలును, శారద వరుసలో (3+5+5+3 మాత్రలొకపాదముగా) నుండు కథలును 'పదములు' అనబడును. రగడలు, పద్యములు, దరువులు కీర్తనలు కలిగి, యక్షగానములను, హరికథలను పోలిన రచనలు జంగం కథలు. పదములు, జంగం కథలు ప్రధానముగా పౌరాణికేతి వృత్తములను కలిగియుండును.

బొబ్బిలి వరుసకథలను నాలుగు వర్గములుగా విభజింపవచ్చును. చారిత్రకములు, సాంఘికములు, జానపదములు, పౌరాణికములు' ఇందు చారిత్రకములలో 'స్పష్టచారిత్రకములు, అస్పష్ట చారిత్రకములు' అను రెండు అంతశ్శాఖలు గలవు. అట్లే యితివృత్తములను బట్టి సాంఘిక వర్గములో పేరంటాండ్రు, సాహసికులు. బందిపోట్లు, గజదొంగలు, గ్రామ కక్షలు-హత్యలు, కుటుంబ కలహములు, లేచిపోవుటలు' అను ఏడు అంతశ్శాఖలను గుర్తింపవచ్చును.

బొబ్బిలి కథ, దేసింగురాజుకథ, జగపతి రాజు కథ లేక పెద్దాపురం కోడి పుంజుల కథ, కొమార రాముడి కథ, రాణీశంకరమ్మ కథ, సదాశివరెడ్డికథ, నల్లసోమనాద్రి కథ లేక గద్వాల సోమనాద్రి కథ, రాజా రామేశ్వరరావుకథ, కర్నూలు నవాబు కథ, ఉయ్యాల వాడ నరసింహారెడ్డి కథ - మొదలగునవి స్పష్టచారిత్రక వీరగాథలు. బంగారు తిమ్మరాజు కథ లేక దేవరాయలుకథ, ముగ్గురు మరాఠీల కథ లేక ఆరెమరాటీలకథ, బాలనాగమ్మకథ, కుంటిమల్లారెడ్డికథ, వేమనకథ, బళ్ళారి కొండ్రాయుడికథ మొదలగునవి అస్పష్టచారిత్రక వీరగాథలు.

కన్యకామ్మవారికథ, కామమ్మకథ, సన్యాసమ్మకథ, మండపేట పాపమ్మకథ, శృంగవరపుకోట ఎరుకమ్మకథ, లక్ష్మమ్మకథ, సాసూలు చిన్నమ్మకథ, వీరరాజమ్మకథ, నల్లతంగాళ్‌కథ, తిరుపతమ్మకథ, ఎరుకల నాంచారికథ, రావులమ్మకథ, సరోజనికథ, ఈడిగదేవమ్మకథ, అంజమ్మకథ, ఉయ్యూరు వీరమ్మకథ లేక గొల్లలవీరమ్మ కథ, గూడూరు నారాయణమ్మకథ, సతీరంగమ్మకథ మున్నగునవి సాంఘిక వీరగాథలలో పేరంటాండ్రశాఖకు చెందినవి. సర్వాయి పాపడుకథ, చిన్నపరెడ్డికథ సాహసికుల శాఖకు చెందును. బందిపోట్ల శాఖలో 'మలగర బాలేసాబుకథ' పేర్కొనదగినది. మియ్యాసాబుకథ, పండుగ శాయన్నకథ, నక్కపల్లి రాముడుకథ, దువ్వన్న దొరపాట– ఇత్యాదులు గజదొంగల శాఖకు చెందును. 'గ్రామకక్షలు–హత్యలు' అను శాఖలో కుంటి పుల్లారెడ్డికథ, యల్లమందనాయుడు కథ, చెన్నకృష్ణారెడ్డికథ, దొర్నిపాడు వెంకటరెడ్డికథ, పరిగరామకృష్ణారెడ్డికథ, సుబ్బిరెడ్డికథ, ఒడ్డుకింద భయ్యారెడ్డికథ పేర్కొనదగినవి. కండెపు సుబ్బయ్యగారి కథ 'కుటుంబ కలహములు' అనుశాఖకును, మందలోడుకథ 'లేచిపోవుట' (elopement) అను శాఖకును చెందును.

గాంధారికథ, కాంభోజరాజుకథ, కమ్మవారిపణతి – పసల బాలుడుకథ, ఎలనాగిరెడ్డికథ, రక్తకొమారుడుకథ, రత్నాంగికథ, కాశీమజిలీ కథలు మొదలగునవి జానపద వీరగాథలు. రామకథాసుధార్ణవము, ఆండాళ్ చరిత్రము లేక శ్రీరంగమాహాత్మ్యము, వరాహావతార చరిత్రము లేక పందికథ, పెద్దకాపుగారికథ, వెంకటేశ్వరుని కథ, మల్లికదేవమ్మకథ, జరాసంధునికథ, కౌశాంబిరాజుకథ, పర్వతాల మల్లారెడ్డికథ, కొమిరెల్లి మల్లన్న కథ – ఇత్యాదులు పౌరాణిక వర్గమునకు చెందిన బొబ్బిలివరుస కథలు. (చూడుడు పట్టీ–8)

మొత్తముపై బొబ్బిలి వరుస కథలలో అర్ధభాగము కవిత్వము, అర్ధభాగము సంగీతము ఉండును. అందుచే వీనికి పాడునప్పుడు ఉన్నంత రసపుష్టి చదువు నప్పుడు ఉండదు. పల్నాటి వీరకథలలోను, కాటమరాజు కథలలోను సంగీతముకన్న సాహిత్యమునకు ఎక్కువ ప్రాధాన్యముండుటచే, అవి పాడునప్పుడే కాక చదువు నప్పుడును రసవంతములుగనే ఉండును. బొబ్బిలి వరుస కథలిట్లుకాక, తంబుర

పట్టిక - 8 :


వీరగాథలు
బొబ్బిలి వరుస కథలు
పదములు
జంగం కథలు
హరిహరీ పదములు
శారదపదములు
చారిత్రకములు
సాంఘికములు
జానపదములు
పౌరాణికములు
స్పష్ట చారిత్రకములు
అస్పష్ట చారిత్రకములు
పేరంట్రాండు
సాహసికులు
బందిపోట్లు
గజదొంగలు
గ్రామకక్షలు -హత్యలు
కుటుంబ కలహములు
లేచిపోవుటలు

శ్రుతితో గుమ్మెట్ల లయతో పాడునప్పుడు మాత్రమే హృదయావర్జకముగా నుండును. కథా ప్రధానములగుటచే వీనిలో రసవద్ఘట్టములు కూడ అక్కడక్కడ మాత్రమే గోచరించును.

పదములు - జంగం కథలు :

వీరగాథలలో బొబ్బిలి వరుసకథల తరువాత ఎన్నదగినవి 'పదములు - జంగం కథలు'. ఇందు పదములు రెండు విధములు 'హరి హరీపదములు', 'శారద పదములు'. హరిహరీ నారాయణాది నారాయణా! కరుణించి మమ్మేలు కమల లోచనుడా!" అను వరుసతోను పునరావృత్తితోను ఉండునవి హరిహరీ పదములు. ఇవి ఖండగతి ద్విపదచ్ఛందముల సమ్మేళనమున ఏర్పడినవని చెప్పవచ్చును. ఈ వరుసలో పాదమునకు రెండు దళములుండును. మొదటి దళమున మాత్రల క్రమము 5+5+5+5 గాను, రెండవ దళమున 5+5+5+5 గాను ఉండును. హరిహరీ పదములన్నియును పౌరాణికేతి వృత్తములను గలిగి యుండును - ముఖ్యముగా రామాయణ సంబంధములు ఎక్కువ. ఈ పదములు పాడునప్పుడేకాక చదువునప్పుడు సహితము రసతృప్తినీయగల కవితాపుష్టిగల రచనలు. ఇవి దేశి సాహిత్యమునకు శిరోభూషణములని విమర్శకుల మెచ్చుకోలు. పసగాడ సన్యాసివంటి వారు ఉత్తమ పదకవులు. ఈ హరిహరీ పదములు క్రీ.శ.1850 నుండి విశాఖ మండలమున విజృంభించినవి.

శారదపదములు, హరిహరీ పదములంత యున్నత మైనవికావు. ఇవి నృత్త ప్రధానమగు దరువులు. అంత్య ప్రాసనియమముతో పాదమునకు 3+5+5+3 మాత్రలతో సాగురచనలు. (కొన్ని పాదములు 5+5+3 గా సాగుట కూడ గలదు). ఇవి ఎక్కువగా ఆటతాళము నడకగలవి. ఈ శారద పదములను తెలంగాణమున శారద కాండ్రు పాడుచుందురు.

జంగం కథలో ప్రధాన కథాభాగము 'రగడ' అను ఛందమున సాగును. బొబ్బిలి కథలోని వరుసకు యతి ప్రాసలు బిగించుటచే ఈ జంగం రగడ ఏర్పడినదని నా నమ్మకము. ఈ రగడలో పాదమునకు 8+8+9 మాత్రలుండును. మన జంగం

కథలు మహారాష్ట్రుల కాలక్షేపములకు ప్రతిబింబములని కొందరు విమర్శకుల తలంపు. ఈ జంగం కథలు హరిహరీ పదములంత ప్రాచీనమైనవికావు. ఈ శతాబ్ద ప్రారంభమున గుంటూరు మండలమున తలయెత్తినవి. జంగం కథకు హరికథతోను, యక్షగానముతోను, తెలంగాణ మందలి చిరుతల కథతోను సన్నిహిత సంబంధమున్నదని చెప్పవచ్చును. ముద్రితములైన జంగం కథలు కొల్లలు! కవిత్వ విషయమున మాత్రము ఇవి గుల్లలు, రసవద్రచన నూటికిని కోటికిని ఒకటి ప్రత్యక్షమగు చుండును. తంబుర గుమ్మెటల ఆర్భాటముతో పాడునప్పుడు మాత్రమే యివి రసవంతములు. వీనిని చదివి ఆనందించుట కష్టము.

వీరగాథానికలు లేక లఘువీరగాథలు (Balladlings) :

ఒక గంటలోపుగాని, లేదా కొలది నిముషములలో గాని పాడబడు గేయకథలు 'వీరగాథానికలు' లఘువీరగాథలు' (ballad lings). వీనిని 'పదములు', పాటలు' అను పేర్లతో వ్యవహరింతురు. కాని, వీరగాథకులవలె వీనికి 'కథలు' అను నామమును ఉపయోగింపరు. నేను మౌఖిక ప్రచారముననున్న లఘువీరగాథలను సుమారు ఎనుబది వరకును సేకరించితిని. కథాఖ్యానము యొక్కనిడివిని బట్టి వీనిని ప్రధానముగా రెండు వర్గములుగా విడదీయవచ్చును: 1. కథాత్మకములు, 2. కథా సూచకములు బుడ్డా వెంగళరెడ్డిపాట, అప్పలాపురం చెన్నారెడ్డిపాట. చిన్నము నెమ్మపాట, చాకలి దుడుమన్నపదము, వానదేవుని పాట మున్నగునవి కథాత్మకములగు వీరగాథానికలు. ఇవి ఒక గంటలోపులో పాడబడును. గుజ్జాల గోపిరెడ్డిపాట , మానందిరెడ్డిపాట, నారసింహారెడ్డి పాట మున్నగునవి కథా సూచకములగు వీరగాథానికలు. ఇవి కొలది నిమిషములలో పూర్తి యగును.

ఇతివృత్తమునుబట్టి పరిశీలించినచో లఘువీరగాథలలో ఆరువర్గములు గోచరించును: చారిత్రకములు, విప్లవజన్యములు, సాంఘికములు, దానవీర ప్రశంసలు, జానపదములు, పౌరాణికములు. చారిత్రకములలో 'వీరమరణములు, వీరప్రశంసలు' అను రెండు అంతశ్శాఖలు గలవు. అట్లే సాంఘికములను వర్గములో 'గ్రామకక్షలు– హత్యలు, స్వైరిణులు – భర్తృహంతలు, పందెములు – స్పర్థలు,

ఆత్మత్యాగములు - కట్టపదములు, విధివైపరీత్యములు - ప్రమాదము' - అను ఐదు అంతశ్శాఖలను గుర్తింపవచ్చును.

దొరవారి నరసింహారెడ్డిపాట, ధర్మాపురం నరసింహునిపాట, చిన్నపరెడ్డిపాట, అల్లూరి సీతారామరాజుపాట మున్నగునవి వీరమరణములకు చెందిన చారిత్రక గాథానికలు. పిచ్చుకుంట్లపాడు నారసింహారెడ్డిపాట, మీరుట్ల చిన్నమల్లేశునిపాట, ఓబులరెడ్డి పాలాటపుకోపు, పెనుగొండకోట మున్నగునవి వీరప్రశంసచేయు చారిత్రక గాథానికలు.

నల్లగొండ మండలమునను, దాని పరిసరములందును వ్యాపించి యున్న పాటలు - ముఖ్యముగా రేణికుంట రామిరెడ్డిపాట, చిలకమ్మపాట, పసునూరి వెంకటరెడ్డిపాట, యలకపల్లి యాదగిరిపాట, గొట్టె ముక్కల గోపాలరెడ్డిపాట, కొంత కొండలరెడ్డిపాట, దొడ్డికొమరయ్య పాట మొదలగునవి విప్లవ జన్యములగు వీరగాథానికలు (తెలంగాణా విప్లవము : 1945-49).

సాంఘికములలో గుఱ్ఱాల గోపిరెడ్డి, మానందిరెడ్డి, గడేకల్లు నాగిరెడ్డి, బండోళ్ళ కురుమలన్న, గుడిపాటి చలమయ్య, మల్లారెడ్డి సలపల అమ్మినాయుడు మున్నగువారిపై గల పాటలు గ్రామకక్షలకు హత్యలకు సంబంధించినవి. అద్దాల సుబ్బులుపాట, చిన్నమునెమ్మ పాట, వీరసోమిపాట, గుంటూరు అదెమ్మపాట మున్నగునవి 'స్వైరిణులు-భర్తృహంతలు' అను విభాగమునకు చెందును. అప్పలాపురం చెన్నారెడ్డిపాట, గొఱ్ఱెపోతుల పందెము మొదలగునవి 'పందెములు-స్పర్ధలు' అను అంతశ్శాఖలోనివి. లలికట్టపదము, ఒద్దిరాజులపాట, బోనకాటపరెడ్డిపాట, ముసలమ్మగండి, వర రాజమ్మపాట ఇత్యాదులు ఆత్మత్యాగముతో కూడిన కట్టపదముల ఎల్లల చెరువు పొంగిన పాట, మూసి పొంగిన పాట, పల్నాటి ప్రళయము, పెన్నేటి పొంగు, అల్లునిపాట, జనగామరైలు ప్రమాదము, జడ్చర్లరైలు ప్రమాదము మొదలగునవి 'విధివైపరీత్యములు - ప్రమాదములు' అను అంతశ్శాఖకు చెందిన లఘువీరగాథలు.

బుద్దావెంగళరెడ్డి, సుద్దపల్లి లక్ష్మమ్మ, యాదాళ్ళ నాగమ్మ, చిన్న అండ్లూరు శివమ్మ, డొక్కా సీతమ్మ మున్నగు వారిని గూర్చి అల్లబడిన పాటలు దానవీర ప్రశంసలు. ఎఱ్ఱపాపపాట, చాకలి దుడుమన్న పదము లేక వీరనాగమ్మ పదము, వానదేవునిపాట, భూపతి రాజుపదము, బొత్తుడుపాట, ఒలియపాచ్చావుపాట మున్నగునవి జానపదములు. రాములపాట, మాయలేడిపాట, సీతమ్మచెర, గరుట పచ్చిపాట, అశోకవనము, ముద్దుటుంగరము, లక్ష్మణమూర్ఛ, కుశలవుల పుట్టు, మంగమ్మపాట, తురకబూబమ్మపాట, జాలోరిగంగ, చెంచీత పాట మున్నగునవి పౌరాణికములు.

ఈ వీరగాథానికలలో చారిత్రక వీరమరణములు, విప్లవ వీరమరణములు, గ్రామకక్షల మూలమున సంభవించిన హత్యలు, ఆత్మత్యాగములతో కూడిన కట్టపదములు, ప్రకృతి తెచ్చిన ప్రమాదములు - ఇవి కరుణరస ప్రధానములు. ఇట్టి పాటలను పాశ్చాత్యులు 'planctus' లేక 'lamenting ballads' అందురు. మన విమర్శకులు వీనికి 'జాలిపాటలు', 'కన్నీటిపాటలు' అనుపేర్లు పెట్టిరి. వీరప్రశంసలగు గాథానికలలో వీరము, పందెములకు సంబంధించిన గాథానికలలో పట్టుదల, భర్తృహంతలగు స్వైరిణుల పాటలలో వారి క్రౌర్యగర్హణమును ద్యోతకమగును. దానవీర ప్రశంసలలో ప్రజలకు వారియెడల గల కృతజ్ఞతలను వెల్లడియగును. జానపదములలో అద్భుతరసము, పౌరాణికములలో భక్తిరసము హెచ్చు (చూడుము పట్టీ -9).

వీరగాథానుకరణములు - బుఱ్ఱకథలు :

మీద చర్చింపబడిన వీరగాథాచక్రములు, వీరగాథలు, వీరగాథానికలు - అను మూడు వర్గములును తెలుగు సాంప్రదాయిక వీరగాథా కవిత్వములోని కొన్ని ప్రక్రియలను అనుకరించుచు ఆధునిక కాలమున 'బుఱ్ఱకథలు, జముకుల కథలు, సుద్దులకథలు, బ్రతుకమ్మపాటలు' - అనునవి బయలుదేరినవి. ఈ అనుకరణ ప్రక్రియలలో నేడు బుఱ్ఱకథలు విశేష ప్రచారముననున్నవి. ఇవి బొబ్బిలి వరుస కథలనుండియు, జంగం కథలనుండియు రాజకీయ ప్రబోధముకొరకు 1942 ప్రాంతమున ప్రభవించినవి. గుంటూరు మండలము వీని పుట్టిల్లు.

పట్టిక - 9 :

వీరగాథానికలు లేక లఘువీరగాథలు (Balladlings)



తం(త్రి+బుఱ్ఱ= తంబుఱ. ఈ తంబుఱతో చెప్పుకథలు 'తంబుఱ కథలు'. ఈ సమాసములో 'తం' లోపించి, శకటరేఫకు పూర్వపుద్విత్వమువచ్చి, 'బుఱ్ఱకథలు' అను నామము ఏర్పడియుండును. లేదా గుమ్మెటలకు 'బుఱ్ఱలు ' అను వ్యవహారము గుంటూరు మండలమున గలదు. బుఱ్ఱలు కొట్టుచు చెప్పు కథలు కావున 'బుఱ్ఱకథలు' అయియుండవచ్చును.

ఈ బుఱ్ఱకథలలో సాధారణంగా జంగంరగడ, ముగ్గురు మరాటీల కథలోని సైసైవరుస, కాంభోజరాజు కథలోని తందనాన వరుసలు ప్రయోగింపబడుచుండును. సర్వాయిపాపని కథ వరుస (ఏలవరుస), జముకుల వరుస (హరిహరీ పదముల వరుస), శారద వరుసలు కూడ బుఱ్ఱకథలలో అచ్చటచ్చట ప్రవేశపెట్టబడుచుండును. శ్రీయుతులు సుంకరసత్యనారాయణ, వారణాసి సత్యనారాయణశాస్త్రి మున్నగువారు చేయితిరిగిన బుఱ్ఱకథా రచయితలు. బుఱ్ఱకథాగానమున గుంటూరులోని శ్రీ షేక్‌నాజర్ అమోఘ ప్రజ్ఞాశాలి!

1946-48 మధ్యకాలమున భారత జాతీయ నాయకులపై బుఱ్ఱకథలు అసంఖ్యాకముగా బయలుదేరినవి. రాజమహేంద్రవరములోని కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు, కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్ మున్నగు గ్రంథ ప్రకాశకులు బుఱ్ఱ కథలను కోకొల్లలుగా ముద్రించుచున్నారు.

ఈ బుఱ్ఱకథలలో ప్రబోధాత్మకములు హెచ్చు. చారిత్రకములు పౌరాణికములు, వీరగాథాజన్యములు-అనువర్గములకు చెందు బుఱ్ఱకథలును గలవు. ప్రబోధాత్మకములగు బుఱ్ఱకథలలో రాజకీయ, సాంఘిక, జాతీయ ప్రబోధములకు ఉద్దేశించినవియును, ప్రభుత్వ ప్రచారమునకు ఉద్దేశించినవియును గలవు.

హరిహరీ పదములను అనుకరించుచు పుట్టిన ఆధునిక ప్రక్రియ 'జముకుల కథలు', 'సుద్దుల కథలు' కాటమరాజు కథలకు అనుకరములు. తెలంగాణమున బొబ్బిలి వరుస కథలను అనుకరించుచు 'తందనాన కథలు'ను, సాంప్రదాయికములగు బ్రతుకమ్మ పాటలను అనుకరించుచు ఆధునికములగు బ్రతుకమ్మ పాటలును బయలుదేరినవి (చూడుడు, పట్టీ-10).

ఇకమీదట వీరగాథల రసపోషణ, వీరగాథా కవిత్వములోని వారాను వర్తనములు, వీరగాథల భాష, వీరగాథల ఛందోరీతులు, వీర గాథాగానమునందలి సంగీతము – అను విషయములు చర్చింపబడును.

వీరగాథలు - రసపోషణ :

వీరగాథలో వీరము ప్రధానరసముగానుండును. లాక్షణికులును, విమర్శకులును వీరరసములో ఇరువది నాలుగు ప్రభేదములను గుర్తించిరి. ఈ ప్రభేదములన్నిటికిని వీరగాథలలో ఉదాహరణములు లభించుచున్నవి. అయినను వీరగాథలలో యుద్ధవీరమే ప్రచురముగా కాననగును. 'వీరము' అనగా 'యుద్ధ వీరము' అనియే పలువురు లాక్షణికుల అభిప్రాయము. బాలచంద్రుని కారెంపూడి యుద్ధము యుద్ధవీరమునకు మహోత్కృష్టమగు ఉదాహరణము. రౌద్ర, బీభత్స, కరుణ, భయానక, హాస్య, శృంగార, అద్భుత రసములు వీరగాథలలో ఆయా స్థలములలో నాయకుని వీరమునకు పోషకముగా వర్ణింపబడుచుండును. శాంతరస మెల్లప్పుడును వీరమునకు విరోధరసమే! శాంత రసప్రధానమగు గేయకథలు వీరగాథా నామమునకు అనర్హములు. లాక్షణికులు తెల్పిన నాలుగు విధముల వీర రసాభాసములకు కూడ వీరగాథలలో దృష్టాంతములున్నవి.

వీరగాథలలో వీరరసమే ప్రధానమైనను, కరుణరస ప్రధానములగు కథలు కూడ కాలక్రమమున నేర్పడినవి. పేరంటాంద్రకథలన్నియును ఇట్టివే. బాలనాగమ్మ, గాంధారికథ, ధర్మాంగద చరిత్ర – పాముపాట మున్నగు వీరగాథలలో వీరరసముకన్న అద్భుత రసమే ప్రాధాన్యమును వహించుచున్నదని చెప్పవచ్చును. భీభత్స హాస్యరసములు రెండును నాయక వీరమునకు పోషకములుగా మాత్రమేకాక, ప్రత్యేకముగా వీరగాథలలో వర్ణింపబడుచుండుట గమనింపవచ్చును.

వీరగాథా కవిత్వము - 'వారానువర్తనములు' (Commonplaces) :

మార్గ సాహిత్యమున ప్రబంధములవలె, దేశి సాహిత్యమున వీరగాథ లన్నియును ఒకే మూసలో తయారయినట్లుండును. వీరగాథలన్నిటను ఒకే రకమగు కథాప్రణాళిక, ఒకే రకమగు వర్ణనలు, అలంకారములు, పదబంధములు ఉండును.

పట్టిక - 10 :


వీరగాథానుకరణములు
బుఱ్ఱకథలు
జముకుల కథలు
గొల్లసుద్దులు లేక సుద్దుల కథలు
తందనాన కథలు
బ్రతుకమ్మ పాటలు
ప్రబోధాత్మకములు
చారిత్రకములు
పౌరాణికములు
వీరగాథాజన్యములు
రాజకీయ ప్రబోధములు
జాతీయ ప్రబోధములు
సాంఘిక ప్రబోధములు
ప్రభుత్వ ప్రబోధములు
పౌరాణికములు
వీరగాథాజన్యములు
సాంఘికములు
రాజకీయములు

ఇట్లు వీరగాథలలో తరుచుగా కాననగు సమానాంశములను 'వీరగాథల వారాను వర్తనములు' (ballad commonplaces) అందురు.

తెలుగు వీరగాథల కథాప్రణాళికలో వీరుడు తన తల్లిదండ్రులకు లేక లేక కలుగుట, బొంగరము లాడుట, ఆయాటలో అతని శౌర్యము ప్రకోపింపబడుట, శత్రువులపై దండెత్తి వెడలుట - మున్నగునవి సాధారణముగా నుండును. ఈ కథాప్రణాళికకు, ముఖ్యముగా బొంగరాలాటకు పల్నాటి వీరకథాచక్రములోని బాలచంద్రునికథ మూలమై యుండును.

ఇట్లు కథాకథనములో అతిప్రధానమైన ఒక కనిష్ఠాంశమును ఆంగ్లమున 'motif' అందురు. (దీనిని కన్నడములో 'ఆశ్య', 'ప్రేరక' 'కథన ఘటక' అని భాషాంతరీకరణము చేసినారు). ఈ 'మోటిఫ్' నకు కథాగమనమును మార్చగలిగిన శక్తి యుండును. కథను చెప్పువాడు దీనిని మరచుటకు వీలులేదు. ఈ మోటిఫ్ పైన చెప్పినట్లు బొంగరాలవంటి ఒక సంఘటన కావచ్చును. లేదా సవతి తల్లి, పేదరాసి పెద్దమ్మ, కడగొట్టు కొడుకు, లేక కూతురు (వీరు సాధారణముగా మూడవ వారుగా కాని, ఏడవ వారుగా కాని ఉందురు), విశేషమైన శక్తులు కలిగిన చిలుక, కుక్క (బాలనాగమ్మ) పాము (ధర్మాంగద చరిత్ర), గుఱ్ఱము (పల్నాటి వీరకథలలో అలరాజు గుఱ్ఱము 'సవరాలజిమ్మడు', పెద్దన్న బాదరాజు గుఱ్ఱము 'కారుబొల్లడు') కోడిపుంజు (పల్నాటి వీరకథలు) మొదలగు పాత్రలు కావచ్చును. లేదా మంత్రదండము, చంద్రాయుధము, ఎగిరెడి రత్నకంబళి, చెప్పులు, చావురానీయని తులసి వనమాల (బ్రహ్మానాయుడు అలరాజు మెడలో వేసినట్టిది) మొదలగు వస్తురూపమున నుండ వచ్చును. ఉదాహరణకు 'రాముడు క్రొత్తదుస్తులు ధరించి ఊరికి వెళ్ళెను' అను వాక్యము సాధారణ వాక్యము. దీనిలో మోటిఫ్స్ లేవు. అట్లుకాక "బాలనాగమ్మ కొడుకు ఏడు సముద్రములు దాటి వెళ్ళి మఱ్ఱిచెట్టు తొఱ్ఱలోనున్న చిలుకను పట్టి తెచ్చెను" అను వాక్యములో విశేషాంశములు కలవు. వీడు సముద్రములు దాటుట, మఱ్ఱిచెట్టు, చిలుక అనునవి యిందలి 'కథన ఘటకములు' (motifs). ఇవి వీరగాథలకన్న జానపద కథలలో ఎక్కువగా నుండును. ప్రపంచములోని వివిధ కథలలోని 'మోటిఫ్స్'ను అన్నిటిని 'motif index of folk -literature' అను పేరుతో stith thompson అను అమెరికను జానపద విజ్ఞానవేత్త ఆరు సంపుటములను ప్రకటించినాడు.

ఈ కథన ఘటకములు ఒక్కొక్కప్పుడు పదప్రయోగమునకు సంబంధించియు నుండవచ్చును. ఏ వీరగాథలోనైనను కోపమును వర్ణించునప్పుడు సాధారణముగా 'తెల్లని గుడ్లకు తెచ్చెరకతంబు' అను వారానువర్తనము ప్రయోగింపబడుచుండును. శోకమును వివరించునపుడు "కుడికంటి వుదకాలు కుంభవరషములాయె, ఎడమకంటి వుదకాలు ఏరులైపారె" అని వర్ణింపబడుచుండును. ఇట్లే 'గళ్ళున నవ్వ', 'ఆగ్రుడైమండి', 'కండ్లజూచు', 'వినవయ్య చెప్పెదవిశదంబుగాను' 'అప్పుడు-ఆడెనొకమాట' వంటి పదములు, వాక్యములు ప్రతి వీరగాథలోను కానవచ్చును. 'కలికికలికి గాంధారివేళ', 'రాయిరాయి కరిగేవేళ' ఇత్యాదిగా రాత్రివర్ణన కొనసాగును. ఇట్టివానిని 'శబ్దకథన ఘటకములు' (word motifs) అందురు.

విశేషణములు, విశేష్యములు త్రిప్పి త్రిప్పి చెప్పబడుచుండును. (ఉదా॥ "ఎండిదే బొంగరము పైడిదే జాలె, పైడిదే బొంగరము ఎండిదే జాలె)" ఎరుకలసాని వేషము, జంగము వేషము, చాల తరుచుగా వర్ణింపబడుచుండును. ప్రాచీనమైన సైన్యవర్ణనములో కూడ 'పరాసువారు, తుపాకులు, ఫిరంగులు' చెప్పబడును. యుద్ధవర్ణన, రణరంగ బీభత్సవర్ణన ఏ వీరగాథలోనైనను ఒకే విధముగానుండును. నరుకుతవుంటే నల్లశిరసులు రాలుట, పొడుస్తవుంటే పొట్టపేగులు పడుట, అప్పుడు తిన్నా పప్పు అన్నమూ కుప్పలు తెప్పలగుట' ఇత్యాది వర్ణనలు ప్రతి వీరగాథలో నుండును (ఈవర్ణనలన్నింటికిని బొబ్బిలికథ మూలముగా కన్పట్టును). వీరపత్నులకు, వీరమాతలకు దుస్స్వప్నములు వచ్చినట్లు చెప్పబడును. (ఇదియును 'కథనఘటక'మే) వీరులు 'ఎండలకు ఎండిపట్టు దేరాలు, నీలకు నీలిపట్టు దేరాలు ఎత్తినట్లు పదేపదే చెప్పబడుచుండును (word motifs).

వీరుడు ఒక ప్రయాణము చేయునప్పుడు మార్గమధ్యమున నున్న ఊళ్ళ పేర్లన్నియును ఏకరువు పెట్టబడును. వీరుని సేవకుల పేర్లు, సంగాతకాండ్ర పేర్లు, జంతువులపేర్లు వరుసగా పెద్ద పట్టికగా చెప్పబడును. సంఖ్యావాచకములలో ఏడుశబ్దమునకు ప్రాచుర్యము కాననగును (numver motif). కొన్ని వస్తువుల పేర్లు (చంద్రాయుధము, వెండికట్ల కిన్నెర మొ॥), కొన్ని పట్టణముల పేర్లు (వాలుగొండ, దేవగిరి, ఓరుగల్లు మొ॥) పదేపదే వచ్చుచుండును. స్త్రీల స్నానవర్ణన, అలంకరణవర్ణన మున్నగునవి కూడ వారానువర్తనములే.

అలంకారములలో ఉపమాలంకారము హెచ్చు. తెలుగుభాషలోని సిసలైన సామెతలు, జాతీయములు, పలుకుబడులు, వీరగాథాకవిత్వమున కొల్లలుగానుండును. ఇట్లు అన్ని వీరగాథలకును సమానమగు వారానువర్తనములే కాక, ఒక్కొక్క వర్గమునకు ప్రత్యేకమైన వారానువర్తనములును గలవు. వీరగాథల వారానువర్తనముల వలన నిరక్షరకుక్షులైన గాథాకారులు అనేక గాథలను జ్ఞప్తియందుంచు కొనగలుగుచున్నారు.

వీరగాథల భాష :

వీరగాథల భాష జానపదుల వ్యావహారికభాష. ఇది సహజమై, సూటియై, సుందరమై, మధురాతి మధురమై దేశీయతను పుక్కిలించు జీవద్భాష. "అల్పాక్షరముల ననల్పార్థరచన కావించుటయె కాదె కవి వివేకంబు" అను పాల్కురికి సోమనాథుని సూక్తికి వీరగాథలభాష చక్కని యుదాహరణము. ఇది వ్యాకరణాలంకార నియమములకు కట్టువడక, అలతియ లతిపదములతో అప్రయత్నముగా వెడలెడు వ్యావహారికభాష.

వీరగాథలలో అర్థాలంకారములే కాని శబ్దాలంకారములుండవని చెప్పవచ్చును. అర్థాలంకారములలో కూడ ఉపమాలంకారమే హెచ్చుగా వాడబడుచుండును. ఈ ఉపమాలంకారములు జానపదుల నిత్యజీవితములో తారసిల్లునట్టివి. దృష్టాంతము, రూపకము, స్వభావోక్తి, అప్రస్తుత ప్రశంసవంటి అలంకారములు చెదరు మదురుగా నుండును.

వీరగాథలలో ఇంపైన సామెతలెన్నియో కలవు. ఈ సామెతలకు రెండింతలు జాతీయములున్నవి. పలుకుబడులు, నుడికారములు, నానుడులు వీరగాథలలో అడుగడుగునను ప్రత్యక్షమగుచుండును. పదజాలములో నిఘంటువులకెక్కని అపూర్వ దేశిపదము లెన్నియో కలవు. వైరిసమాసములును, అన్యదేశ్యములును కాననగును. వ్యావహారిక రూపముల ననుసరించియే సంధివంటి వ్యాకరణాంశములు కన్పట్టుచుండును. ఇంత వైవిధ్యముగల వీరగాథల భాషను గూర్చి భాషాశాస్త్రజ్ఞులు ప్రత్యేకముగా పరిశోధింపవలసియున్నది.

వీరగాథల ఛందస్సు :

వీరగాథల ఛందస్సు లక్షణ గ్రంథములకు అందునదికాదు. తెలుగులో ద్విపద వికారములును రగడ వికారములను అగు వీరగాథాచ్ఛందములున్నవి. శాసన

ప్రమాణమును బట్టి తెలుగు ఛందస్సులలో తరువోజ ప్రాచీనమైనదిగా కన్పట్టును కాని, ఛందః పరిణామమును బట్టి పరిశీలించినచో "కిటతకిట, కిటతకిట, కిటతకిట, కిటతకిట" అని సాగు ఖండగతి అన్నిటికంటెను ప్రాచీనమైనదిగా తోచును. పూర్వకాలమున వీరగాథలన్నియు ఈ ఛందస్సులోనే ఉండెడివి. ఈ ఖండగతినుండి మంజరీ ద్విపద, ఈ మంజరీ ద్విపదనుండి ద్విపద, ఈ ద్విపద నుండి తరువోజ, తరువోజనుండి సీసము పరిణమించియుండును.

శక్తికథలలో ఖండగతి, పల్నాటి వీరకథలలో మంజరీ ద్విపద, కాటమరాజు కథలలో ద్విపద బహుళముగా గానవచ్చుచున్నది. వీరగాథలలోని ద్విపదకాని, మంజరీ ద్విపదకాని లాక్షణికులు చెప్పినట్లుగా ఇంద్ర సూర్యగణముల ప్రకారముండవు. ఒక్కొక్క పాదమునకు ఐదు మాత్రలగణములు మూడు, మూడు మాత్రలగణము ఒకటి 5+5+5+3 చొప్పున వీని రచన సాగును. యతి ప్రాసలు ఐచ్ఛికములే కాని నియతములు కావు. కాని, యతి సర్వత్ర పాటింపబడినదని చెప్పవచ్చును. ఇంద్రగణములలో 'భ'గణము, 'నల' గణము నాలుగు మాత్రలవే కావు, వీనికొక మాత్రమను చేర్చి, 'భల', నలల' అను రీతిలో వీరగాథలలో ప్రయోగింపబడుచుండును. ఒక్కొక్కప్పుడు ఈ ద్విపద, మంజరీ ద్విపదలు శిథిలములపై ఖండగతిగా మారిపోవుచుండును. ఈ ఖండగతి కూడ శిథిలమై మరింత సాగిపోవుటయుగలదు.

బొబ్బిలి వరుసలో ఒక్కొక్కపాదమున 8+8+9 (10) మాత్రలుండును, యతి ప్రాసలు కాకతాళీయములే కాని నిబద్ధములు కావు. ఈ బొబ్బిలి వరుసనుండి 8+8 (10) మాత్రలొక పాదముగా వేరొక వరుస పరిణమించినవి. కాంభోజ రాజుకథ, వరాహావతార చరిత్ర (పందికథ), చిన్నపరెడ్డి కథ మున్నగునవి 8+8 మాత్రలొక పాదముగా సాగు వీరగాథలు. బాలనాగమ్మకథ, లక్ష్మమ్మకథ, కమ్మవారి పణతివసల బాలవాజు కథ మున్నగునవి 7+9 (10) మాత్రలొక పాదముగా సాగు వీరగాథలు.

ముగ్గురు మరాటీల కథలోని వరుస, సర్వాయిపాపని కథలోని వరుస ప్రత్యేకములు. ముగ్గురు మరాటీలకథ వరుసను 'సై సై వరుస' అందురు. ఇందు పాదమునకు 12 మొదలుకొని 15 మాత్రల వరకును ఉండునట్లుగా కొన్ని పాదములు చెప్పి, చివర 14 మొదలుకొని 16 వరకును మాత్రలుండునట్లుగా ఒక్క పాదముతో ముక్తాయింపు చేయబడును. ఈ వరుసలోని పూర్వపాదములు ఇట్లు విరుగుచుండును:

8+4=12; 8+5=13; 9+5=14; 10+5=15. ఈ వరుసలోని ముక్తాయింపు పాదము ఇట్లు విరుగును. 8+5=14; 9+6=15; 10+6=16 వీనిలో 8 మాత్రల గణము 3+5గా కాని, 4+4 గా కాని విరుగును. 9 మాత్రల గణము 3+3+3 గా విరుగును. 10 మాత్రల గణము 5+5 గా విరుగును.

ఇక సర్వాయి పాపని కథ వరుసను 'ఏలవరుస' యని చెప్పవచ్చును. ఇందు 7+7=14 మాత్రలొక పాదముగా రెండు పాదములును, 7=9=16 మాత్రలొక పాదముగా మరి రెండు పాదములును చెప్పబడును. మూడవ పాదము చివర 9 మాత్రల సంబోధన మొకటి అధికముగా నుండును. యక్షగానములలో నుంకరి కొండడు - గొల్లభామల ఏలలు ఇట్లే ఉండును.

ఒక ఖండగతి పాదము, ఒక ద్విపద మంజరి పాదము కలసి హరిహరీ పదముల వరుస యేర్పడినది. దీనిని 'జంపెవరుస' అనియు, 'జముకుల వరుస' అనియు పిలుతురు: దీని గణముల నిట్లు నిరూపింపవచ్చును:

5+5+5+5

5+5+5+5

యతి ప్రాసలును, ప్రాసయతులును ఇందు గాననగును.

3+5+5+3 మాత్రలొక పాదముగా అంత్య ప్రాసలతో ఆట తాళమున సాగెడి రచనలు 'శారద పదము' లనబడును. ఈ శారద వరుసలో ఒక్కొక్కప్పుడు మొదటి మూడు మాత్రల గణములోపించి 5+5+3గా రచన సాగుటయు గలదు.

8+8+9 (లేదా 10) అను బొబ్బిలి వరుసకు యతిప్రాసలు, అంత్య ప్రాసలు ఏర్పడుటచే 'జంగం రగడ' ఏర్పడి యుండును. లేదా మహారాష్ట్రుల 'గజల్, డోరా, డోరాగజల్ మట్టు' అను ఛందస్సుల ప్రభావముచే ఈ జంగం రగడ పుట్టియుండ వచ్చును. యక్షగానములలో ప్రయుక్తములైన పై ఛందస్సులు అచ్చముగా జంగం రగడ వలెనే యున్నవి.

వీరగాథానుకరణములగు బుఱ్ఱకథలలో బబ్బిలి వరుస తద్భేదములు, సైసైవరుస, సర్వాయి పాపని వరుస, జముకులవరుస, శారదవరుస మున్నగునవి అన్నియును గానవచ్చుచున్నవి.

తెలంగాణమున ప్రసిద్ధికెక్కిన మియాసాబు కథ, కొమిరెల్లి మల్లన్న కథ మున్నగు వానిలో త్రిశ్రగతి (3+3+3+3) కాననగును. నల్ల తంగాళ్ కథకూడ త్రిశ్రగతిలోనే సాగినది. సుబ్బిరెడ్డి కథ రూకగతి (6+6+6+6)లో నున్నది.

వీరగాథానికలలో త్రిశ్ర, చతురశ్ర, ఖండ, రూపక, మిశ్ర ఆది గతులన్నింటికిని ఉదాహరణములు లభించుచున్నవి. గుంటూరు ఆదెమ్మఆట, మరుట్ల చిన్నపల్లేశు పాట, గడేకల్లు నాగిరెడ్డిపాట మున్నగునవి త్రిశ్రగతిలోనున్నవి. సిద్దాపురం కట్టపదము చతురశ్రగతి (4+4+4+4). ఖండగతి (5+5+5+5)లో నున్న లఘువీర గాథలు పెక్కుగలవు. లలి కట్టపదము, వానదేవుని పాట, సీతమ్మ చెర, నల్లగొండ పాట మున్నగునవి అన్నియును ఖండగతి లోనే సాగినవి. త్రిశ్రగతికి రెట్టింపు రూకగతి. అద్దాల సుబ్బులు పాట, అల్లుడు పాట, మల్లన్నపాట మొదలగునవి రూపకగతికి ఉదాహరణములు. మిశ్రగతి (7+7+7+7)లో నడచిన పాటలు 'అప్పలాపురం చెన్నారెడ్డిపాట, గుఱ్ఱాల గోపిరెడ్డి పాట, మొదలగునవి. బుడ్డా వెంగళరెడ్డిపాట, పోట్ల బూదయ్య పాట ఇత్యాదులు ఆదిగతి (8+8+8+8)కి చెందినవి. చతురశ్రగతికి రెట్టింపు ఆదిగతి.

లాక్షణికులు చెప్పిన నవవిధ రగడలకును వీరగాథల వరుసలకును మిక్కిలి సన్నిహిత సంబంధమున్నది. హయప్రచార, తురగవల్గన రగడలు - త్రిశ్రగతికిని., మధురగతి, హరి గతి రగడలు - చతురశ్ర గతికిని, ద్విరదగతి, జయభద్ర రగడలు - ఖండగతికిని, హరిణగతి, వృషభగతి రగడలు 6 మిశ్రగతికిని - సరిగా పరిపోవును. ఈ రగడలకు కన్నడిగుల షట్పదులతో గూడ పోలికలున్నవి.[8]

పల్నాటి వీరకథలలోను, కాటమరాజు కథలలోను యతి ప్రాసలు చక్కగా పాటింపబడినవి. కొన్ని కథలలో మాత్రాగణములు శిథిలములైనను యతిప్రాసలకు భంగము వాటిల్లలేదు. యతిభంగముగా తోచుపదములలో జానపదుల ఉచ్చారణను పరిగణింపవలసియున్నది. యతిభంగమును వారించుటకై జానపద కవులు అపశబ్దములను సహితము ప్రయెగించిరనుటకు దృష్టాంతములున్నవి. అఖండయతి, ద్విప్రాస, మున్నగునవి వీరగాథలలో అచ్చటచ్చట కానవచ్చును.

గాథాగానము - సంగీతము :

పాడబడుట వీరగాథల ప్రధాన లక్షణము. కాని గాథాగానము గొంతు

మంద్రస్థాయినుండి తారస్థాయికెత్తినను ఎక్కువ రాగభేదములను చూపక, ఛందస్సును సూచించు వైవిధ్యముతో మాత్రమే పాడవలెను. స్వరముతో అక్షరములను మ్రింగివేయక స్పష్టముగా నుచ్చరింపవలెను. వీరగాథలు గేయరూపమున నున్నను, వీనిలో 'ధాతువు' (సంగీతాంశము) కన్న 'మాతువు' (సాహిత్యాంశము) ప్రధానమైనది. వీరగాథల ఛందస్సంతయు సంగీత శాస్త్రములోని 'గతి' లేక 'జాతి' భేదములలో ఇమిడిపోవును. కావున వీరగాథలు, తాళ ప్రధానములని చెప్పవచ్చును. స్వరములలో సప్తస్వరము లుండవు కాని, ఒకటి రెండు స్వరములుండును.

వీరగాథలు ఎక్కువగా అట (ఆట) తాళములోను, ఆదితాళములోను సాగుచుండును. యుద్ధఘట్టములందు ఏకతాళముపడును. జంపె, త్రిపుట, రూపకము, జుల్వ, కురుజంపె మొదలగు తాళములను సందర్భమును బట్టి ప్రయోగింపబడు చుండును. ఇట్లు వీరగాథలు తాళ ప్రధానములగుటచే వీనిని పాడుటకు తట్టు వాద్యములను విశేషముగా నుపయోగింతురు. పంబజోడు, గుమ్మెటలు మొదలగునవి వీరగాథలలోని తాళమును తిత్తి, తంబురవంటి వాద్యములు వీరగాథల శ్రుతిని నిలుపుచుండును.

సాంప్రదాయిక వీరగాథలలో ఆయాపేర్లతో రాగములు లేకపోయినను, రసానుగుణముగా వరుసలను మార్చుటకలదు. జంగం కథలలోను, బుఱ్ఱకథలలోను రాగచ్ఛాయలు స్పష్టముగానున్నవి. విషయ ప్రధానమగు ఘట్టములలో దేవగాంధారి రాగమును, ఏడ్చుటకు ముందుండెడి విచారమును సూచించుటలో తోడిరాగమును, దుర్భర శోకమును వ్యక్తమొనర్చునప్పుడు ఫీలు రాగమును, రౌద్రరసపోషణములో శ్రీరాగమును. బీభత్స భయానక రసములలో మోహన రాగమును, సంతోషమును సూచించునప్పుడు శంకరాభరణ, ఆనందభైరవి రాగములను ఉపయోగించుట పరిపాటి. జంగం కథలలో ఆటతాళము, బుఱ్ఱకథలలో ఆదితాళము హెచ్చుగా కానవచ్చుచున్నది.

సంగీతాంశమును బట్టి వీరగాథలను మూడు విధములుగా వర్గీకరింపవచ్చును: 1) ఒకే వ్యక్తిపాడు వీరగాథలు, 2) ఒక వ్యక్తి పాడుచుండగా ఇద్దరు ముగ్గురు వంతపాడు వీరగాథలు, 3) అందరును కలిసిపాడు వీరగాథలు. తెలుగు వీరగాథలలో ఎక్కువభాగము రెండవ వర్గమునకు చెందునని చెప్పవచ్చును. కిన్నెర కథలు మొదటి వర్గమునకును, కోలాటపు కోపులుగాపాడు లఘువీరగాథలు

మూడవ వర్గమునకును ఉదాహరణములు తక్కినవన్నియును రెండవ వర్గము నకే చెందును. వీరగాథలలోని సంగీతమును గూర్చి సంగీత విద్యాంసులింకను శోధింపవలసియున్నది. పాశ్చాత్య దేశములలోవలె వీరగాథల సంగీతమును చిత్రించి చూపుట కూడ అత్యావశ్యకము.

ఇక వీరగాథల వైశిష్ట్యమును గూర్చియు, ఆంధ్రదేశములోని వివిధ గాథాకారులను గూర్చియు, వీరగాథల క్షీణతాకారణములను గూర్చియు, వీరగాథల సేకరణము-పరిరక్షణములను గూర్చియూ స్థూలముగా చర్చింతము.

వీరగాథల వైశిష్ట్యము :

వీరగాథల వైశిష్ట్యమును అనేక విధములుగా నెన్నవచ్చును. వీరగాథాప్రక్రియ ప్రపంచమున ప్రతి సాహిత్యమందును స్వతంత్రముగా పుట్టిన ప్రక్రియ. ఇది ఇతిహాస కవిత్వమునకు మూలకందమే. వీరగాథలు నిసర్గమనోహరములు. సహజత్వమే వీనికి ప్రాణము. ఒక దేశములోని వీరగాథలన్నియును ఆ దేశ సంస్కృతిని పట్టియిచ్చు జాతీయతా చిహ్నములుగా నుండును. దేశస్వాతంత్ర్యమును కాపాడుకొనుటకు ప్రజలలో వీరగాథాగానము అత్యవసరము. వీరగాథలు దేశమునకు గర్వ కారణములు. ఇవి ప్రజాజీవితమును మణిదర్పణములవలె ప్రతిబింపజేయును.

నవరసములలోకెల్ల విశిష్టమైన వీరరసముచే వీరగాథలు నిండియుండును. ఎక్కడో చనిపోయిన వీరులు గాథాగానముచే మరల పునరుజ్జీవితురగుదురు, శ్రోతలమనో నేత్రములకు ప్రత్యక్షమగుదురు. తెలుగు సాహిత్యమంతయు సంస్కృత పరివర్తనమే అను నిందను బాపగల ఒకే ఒక సాధనము వీరగాథాకవిత్వము.

వీరగాథలకు మూడు మహత్తర శక్తులున్నవి: 1) సర్వజనా కర్షణ శక్తి- ఇవి సరళముగా నుండి సర్వజనులను ఆకర్షించును. 2) సంఘ సంచాలక శక్తి – వీరగాథలు సంఘమును సంచలింపజేసి మహావిప్లవములను సృజింపగలవు. 3) విచిత్రాను భూతిదాయ శక్తి- ఇవి శ్రోతలకు విచిత్రమగు ఆత్మీయానుభూతి నొసంగ గలవు.

దేశదేశములలో వీరగాథల వలన శిష్టకవులు ప్రభావితులైనారు. వీరగాథల వలన భాషకు సహజత్వము, జీవము కలుగును. కొన్నిసాంఘిక ప్రయోజనములును నెరవేరగలవు. వీరగాథలు 'విధిబలీయము, మానవుడు నిమిత్తమాత్రుడు' అను నీతిని నిశ్శబ్దముగా ధ్వనింపజేయును.

గాథాకారులు :

వీరగాథలను పాడు దేశద్రిమ్మరులైన గాయక భిక్షువులను గాథాకారు' లనియు, గాథకులనియు పిలువవచ్చును. ఈగాథాకారులకు వివిధ భాషలలో వివిధ నామములున్నవి: Minstrels (English), Jongleurs (French), Scops (Old English), Bards (Irish), Skald (Scandinavian), Minnesingers (German), Trouba- dows (Spanish). రావీ (అరేబియన్), చారణులు (హిందీ), భోపాలు, మిరోసీలు (రాజస్థానీ), రావత్ (మధ్యప్రదేశ్), వృత్తి గాయకరు (కన్నడము), జంగములు (తెలుగు).

నేడు బిచ్చగాండ్రుగా మారిన ఈ గాథకుల చరిత్రలో నాలుగు ఘట్టములున్నవి. మొదట వీరశిఖామణులగు రాజులు తమ సాహసకృత్యములను తామే గానమొనర్చు కొనెడివారు. తరువాత తమ సాహసములను కీర్తించుటకు ప్రత్యేకముగా భట్టులను నియమించు కొనిరి, కాలక్రమమున రాజ్యములంతరింపగా, ఈ భట్టులును వంది మాగధులును రాజ్యములను కోల్పోయిన ఆయా కులముల వారిని యాచించుచు 'యాచకులను పేరుతో వ్యవహరింపబడుచుండెడివారు. పాశ్చాత్య నాగరకతా ప్రభావమున ఈ యాచకు'లకు మన సంఘములో నీచస్థానమేర్పడి అనాదరము హెచ్చినది. ఫలితముగా వీరు అన్ని కులముల వారిని యాచించుచు, సంచారగాయక భిక్షువులుగా మారిపోయిరి. కొందరు తమ కులవృత్తిని విడనాడి అన్యవృత్తులను స్వీకరించిరి.

ఆంధ్రప్రదేశమున ఈ సంచారగాయక భిక్షువులు పలురకముల వారున్నారు: బవనీలు, పంబలవారు, వీరవిద్యావంతులు, కొమ్ముల వారు, పిచ్చుకుంట్లు, పూసల బలిజలు, శారదకాండ్రు, వీరముష్టులు, జంగములు, దాసరులు, గరుడస్తంభం దాసరులు, భాగవతులు, బీరన్నలవారు, సుద్దుల గొల్లలు, గంగిరెద్దులవారు, బాలసంతువారు, బుడబుక్కలవారు, చిందుమాదిగలు, జోగులవారు, జక్కులవారు, దక్కలవారు, మాష్టీలు, బొమ్మలాటగాండ్రు మొదలగువారుకలరు. ఈ గాథాకారులు అతి ప్రాచీన కాలమునుండియు తెలుగు నాట వ్యాపించియుండిరనుటకు శ్రీనాథుని క్రీడాభిరామము, పాలవేకరి కదిరీపతి (1650) 'శుకసప్తతి', అయ్యలరాజు నారాయణామాత్యుని (1750) 'హంసవింశతి' మున్నగు కావ్యములు సాక్ష్యమిచ్చు

చున్నవి. ఈ గాథకులయందు ముఖస్థరూపమున ఎన్నియో వీరగాథలున్నవి. నాగరకతా ప్రభావముచే అవి నశింపకముందే రక్షించుకొనవలసిన బాధ్యత ప్రతి ఆంధ్ర సాహిత్య తపస్వికిని గలదు!

క్షీణతా కారణములు :

ఆధునిక కాలమున వీరగాథలు నశించిపోవుచున్నవి. ఈ నశింపునకు అనేక కారణములున్నవి. ప్రౌఢకావ్యములను మరగిన పండితుల అలక్ష్యము దీనికి ప్రథమ కారణము. పండితులు దేశికవితలను నిరసించుట ప్రాచీన కాలమునుండియుగలదు. ఇట్టి నిరసనమువలననే మన ప్రాఙ్నన్నయముగములోని దేశికవితలు రూపుమాసినవి. వీరగాథల యెడ పండిత పరిహాసము పాశ్చాత్య దేశములందును గానవచ్చుచున్నది. ప్రాచీనులలో కొందరు మాత్రము వీని ప్రాశస్త్యమును గుర్తించినారు. మొత్తముపై వీరగాథలను పొగడిన వారికన్న తెగడిన వారి సంఖ్యయే యెక్కువ. వీరగాథలు కూడ సాహిత్యమున నొక ప్రధాన భాగమని మరచుటచేతను, నిరక్షరాస్యులనుద్దేశించి చెప్పబడిన జానపద కవిత్వమును ప్రౌఢకవిత్వముతో పోల్చిచూచుటవలనను వీర గాథలయెడ విద్వాంసుల కిట్టి నిరసన భావము కలిగియుండును.

మహాకవులు వీరగాథా రచనము కావింపకుండుట వీరగాథల క్షీణతా కారణములలో రెండవది. తెలుగులో ఒక్క శ్రీనాథుడు, ఆంగ్లమున ఒక్క గోల్డ్‌స్మిత్ మాత్రమే వీరగాథారచన చేసిన మహాకవులు. తక్కిన కవులెవ్వరును ఇట్టి ప్రయత్నము చేసినట్లు కానరాదు. వీరగాథలను ప్రకటించుటలో పండితులు అనేకములగు మార్పులను చేయుటవలన కూడ అవినశించుచున్నవని చెప్పవచ్చును. ముద్రించుట వలన వీరగాథలు నశించిపోవునని తలంచు విమర్శకులు పాశ్చాత్య దేశములలోను ప్రాచ్యదేశములలోను కూడ గలరు. కాని నాకిది సమంజసముగా తోపదు. వీరగాథలోని సాహిత్యాంశమును మాత్రమే ముద్రించినచో వారు చెప్పిన నష్టము కలుగును గాని, సంగీతాంశమును సహితము పదిల పరచినచో అట్టి నష్టము కలుగజాలదు.

నాగరకత వీరగాథలకు పరమశత్రువు. సంఘము నాగరకమైన కొలది అందలి జానపద కవిత్వము నశించును. నేటి చలన చిత్రములు, నిమ్నజాతులలో క్రైస్తవ మత ప్రబోధము, జాతరలను, కోడి పందెములను ప్రభుత్వము నిషేధించుట, మౌఖిక

వీరగాథలను ప్రకటించుటకు ఇష్టపడని గాథాకారుల మూర్ఖత్వము, విశ్వ విద్యాలయముల మౌనము, ఇత్యాదులు వీరగాథల క్షీణతాకారణములలో మరికొన్నియని నా విశ్వాసము.

సేకరణ - పరిరక్షణ :

జానపద సాహిత్య పరిశోధనమనగా మాటలు కాదు. వీరగాథా సంచయనము అష్టకష్టములతో కూడిన పని. నిరక్షరకుక్షులును, మూర్ఖులును, దేశద్రిమ్మరులును, విపరీతమగు త్రాగుబోతులును, అగు గాథాకారులతో వేగుటకు ఓర్పు కావలెను. భారతదేశములోని వివిధ ప్రాంతముల జానపద సాహిత్యమును ఉద్ధరించుటలో శ్రీరామనరేశ్ త్రిపాఠీగారును, తెలుగు జానపద గేయములను సేకరించుటలో శ్రీ నేదునూరి గంగాధరంగారు, ఆచార్య బి.రామరాజుగారును ఎన్ని కష్టములకు లోనయిరో నేను అనుభవ పూర్వకముగా తెలిసికొంటివి. ఎన్ని కష్టములున్నను వీరగాథాసంచయనము కొనసాగింప వలసినదే. లేనిచో ఈ సాహిత్య మంతయు నశించి పోగల ప్రమాదమున్నది.

జానపద సాహిత్య సంచయనమున మిక్కిలి మెలకువను ప్రదర్శించవలెను. H.M.Belden అను అమెరికను విమర్శకుడు జానపద కవిత్వమును సేకరించువారు ముఖ్యముగా గమనింపవలసిన ఆరు విషయములను తెల్పినాడు:

1. గాథకుని నోటినుండి పాట లేదా వీరగాథ ఎట్లువచ్చినదో సరిగా అట్లే వ్రాయవలెను (తప్పుడు, ఆర్థము లేని మాటలు మొదలగనవి యథాతథముగా వ్రాయవలెను).
2. పాటను లేదా వీరగాథను ఎప్పుడు ఎక్కడ ఎవరినుండి సంపాదించితిమో గుర్తింపవలెను.
3. వీరగాథను గాథాకారుడు పాడుచుండగా వ్రాసితిమో, లేక చదువుచుండగా వ్రాసితిమో, లేక ఏదైన వ్రాత ప్రతి నుండి వ్రాసితిమో తెలుపవలెను.
4. ఆ గాథాకారుడు ఈ వీరగాథను ఎక్కడ ఎవరినుండి నేర్చెనో తెలిసి కొనవలెను.
5. గాథకుని కులమును, పూర్వీకులను, స్వస్థలమును గుర్తింపవలెను.
6. గాథకుడు ముద్రిత వీర గాథను గూర్చి తెలిసికొనెనో లేదో పరిశీలింపవలెను.

ఈ ఆరు విషయములను దృష్టియందుంచుకొనినపుడే వీరగాథలను నిర్దుష్టముగా సేకరింపగలము.

రామనరేశ్ త్రిపాఠీగారు, ఆచార్య దేవేంద్ర సత్యార్థిగారు, భారతదేశమున వివిధ ప్రాంతముల జానపద సాహిత్యమును సేకరించినారు, తెలుగులో మొట్ట మొదట వీరగాథలను సేకరించిన మహానుభావుడు సి.పి.బ్రౌను దొర. ఇతడు క్రీ.శ.1842లో ఒక జంగమును నెల రోజుల పాటు తనయింట నుంచుకొని, అతనిచే బొబ్బిలి కథను, కొమార రాముడికథను, కాకమ్మ కథను పాడించి వ్రాయించినాడు. 1874లో J.A. Boyle దొరగారు సర్వాయి పాపడు కథను సేకరించినారు. 19 వ శతాబ్ది ఉత్తరార్థమునుండి వీరగాథలు ముద్రింప బడుట ప్రారంభమైనది. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, శ్రీపాద గోపాలకృష్ణమూర్తిగారు, టేకుమళ్ళ కామేశ్వరరావుగారు, హరి ఆదిశేషువుగారు, ఆచార్య బి.రామరాజుగారు, ఆచార్య తిమ్మావఝుల కోదండరామయ్యగారు, ఆచార్య తూమాటి దొణప్పగారు, డా॥ నాయని కృష్ణకుమారిగారు తెలుగు వీరగాథలను గూర్చి ప్రశస్తమగు కృషిని సల్పియున్నారు. ప్రస్తుతము అమెరికాలోని విస్కాన్‌సిన్ విశ్వవిద్యాలయమునకు చెందిన శ్రీ జీన్ హెచ్.రోఘేర్ (Gens Roghair) అను నాతడు పల్నాటి వీరకథలను గూర్చి కూలంకషముగా పరిశోధన చేయుచున్నాడు. రేడియో శాఖవారు కూడ తెలుగు జానపద సాహిత్యమును ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించుచున్నారు.

ఈ మహత్తర జానపద సాహిత్యమును సంరక్షించుకొనుటకై పెద్దలు కొన్ని సూచనలు చేసియున్నారు. వీరగాథలను సేకరించుటలో కేవలము సాహిత్యాంశమునే కాక సంగీతాంశమును కూడ పదిల పరుచుకొనవలెను. సంప్రదాయములు నశించి పోకుండనుండుటకై తద్గాయక భిక్షువులను ప్రోత్సహించవలెను. ముద్రించుటచే వీరగాథలు నశించిపోవునని కొందరి భయము. కాని కేవలము సాహిత్యమునే కాక సంగీతాంశమును గూడ ముద్రించినచో ఈ భయమునకు తావుండదు. ప్రభుత్వము, సాహిత్య సంస్థలు వీరగాథల సేకరణమునకు నడుము కట్టవలెను!

పాద సూచికలు

1. అందువలననే దీనిని మొదటి రోజులలో 'Folk-lore' అని విడదీసి వ్రాయుచుండెడివారు. కాని యిప్పుడు 'Folk-lore' అని ఒకే పదముగా వ్రాయుట పరిపాటియైనది.
2. కన్నడములో ప్రముఖ జానపద శాస్త్రవేత్తమైన ప్రొ॥ హెచ్.ఎం.నాయక్ గారు 'Folk-lore' 'జానపదము' అని భాషాంతరీకరణము చేసిరి. జానపదమునకు సంబంధించిన సమస్త విషయములును ఇందు గతార్థములగునని వారి అభిప్రాయము. కన్నడిగులు "జనపద" అనునది విశేషణముగా వాడుచున్నారు. (ఉదా॥ 'జనపద గీతము'), 'జనపద కథ', 'జనపద కళ' ఇత్యాది).
3. William Bascom. International Encyclopedia of Social Sciences, **Vol. 5, p. 496.**
4. (By folklore it is meant) "those materials in culture that circulate traditionally among members of any group, in different versions whether in the oral form or by means of customary example".

   – Jan Harold Brunvand,
   The study of American Folklore.
5. "Folk lore includes folk art, folk crafts, folk tools, folk costume, folk custom, folk belief, folk medicine, folk recips, folk music, folk dance, folk games folk gastures, and folk speech as well as those verbal forms of expression which have been called folk literature, but which are better described as verbal art. Verbal art, which includes such forms as folk tales, legends, myths, proverbs riddles and poetry, has been the primary concern of folklorists from both the humanities and social sciences since the beginings of folk lore as a field of study."
   – William Bescom, International encyclopedia of social sciences,
   Vol. 5, pp.496-97.
6. Folklore (is the) generic name used to denote those traditional beliefs, superstitions, manners, customs and observances of ordinary people which have persisted from earlier into later periods... in some cases down to the modern times: folk tales, traditional ballads, folk songs and proverbs also cone under this heading and, by a recent extension of meaning, certain aspect of material culture originally excluded by definition."

   – Encyclopaedia Britannica, vol. 9, p.518.
7. "Objects which are mass produced and knowledge which is acquired through books ar formal education are a part of culture, which includes total body of learning, but they are not folk lore. in non-literate societies folk lore is virtually identical with culture, but in literate industrialzed societies it is only a fragment of culture. Anthropologists and humanists have defined folklore differently, but their definition are in fundamental agreement in excluding all learning that is transmitted by writing."

   – William Bascom,
   International Encyclopaedia of Social Sceinces;
   Vol. 5, pp 496-97.

8. 1) శరషట్పది: 4+4

4+4

4+4+4+2

అట్లే ఉత్తరార్ధము.

2) కుసుమ షట్పది : 5+5

5+5

5+5+5+2

....

3) భోగషట్పది : 3+3+3+3

3+3+3+3

3+3+3+3+3+3+2

....

4) భామినీ షట్పది : 3+4+3+4

3+4+3+4

3+4+3+4+3+4+2

....

5) పరివర్ధినీ షట్పది:

4+4+4+4

4+4=4+4

4+4+4+4+4+4+2

....

6) వార్ధకషట్పది:

5+5+5+5

5+5+5+5

5+5+5+5+5 = 2

....

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

* తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారుచేయడం.
* ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషా సంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
* తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యలు చేపట్టడం.
* తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
* తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
* తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
* తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
* తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం **తెలుగు సంస్కృతి ప్రకాశం**

దేశ భాషలందు తెలుగు లెస్స